ప్రజాశక్తి
ఆదివారం 14 మే 2023 8 పేజీలు
ప్రకాశం బాపట్ల

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న

భూసేకరణ పూర్తి చేయాలి

ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జాతీయ రహదారుల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పిఎస్ ప్రద్యుమ్న తెలిపారు. శనివారం జిల్లాకు వచ్చిన ఆయన కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ దినేష్ కుమార్, సంయుక్త కలెక్టర్ శ్రీనివాసులుతో కలిసి సంబంధిత విభాగాల అధికారులతో వీటిపై ప్రత్యేకంగా సమీక్షించారు. 167 వ నెంబర్ జాతీయ రహదారికి భూసేకరణ, నిర్మాణ పనుల పురోగతి పై ఆయన ఆరా తీశారు. ఆర్థికపరమైన సమస్యలు ఉంటే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వీటిని తీసుకువెళతానని తెలిపారు. ఒంగోలు, దర్శి, మార్కాపురంలలో ఇంటిగ్రేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ సెంటర్ల ఏర్పాటుకు అవసరమైన సుమారు 5 ఎకరాల భూములను త్వరగా కేటాయించేలా చూడాలని కలెక్టర్‌కు ప్రద్యుమ్న సూచించారు. ప్రస్తుతం ఒంగోలులో ఉన్న డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ ను ఆయన పరిశీలించారు.

ఆర్‌టిసి బస్టాండ్ పరిశీలన

ఒంగోలు ఆర్‌టిసి బస్టాండ్, గ్యారేజీలను ప్రద్యున్న పరిశీలించారు. కార్గో సేవల ద్వారా వస్తున్న ఆదాయం, అందిస్తున్న సేవలపై సమీక్షించారు.. సమీక్ష సమావేశంలో గుంటూరు ప్రాంత జెటిసి శ్రీకృష్ణవేణి, జిల్లా ఇన్‌ఛార్జి డిటిసి చందర్, ఆర్అండ్‌బి ఎస్ఇ విజయరత్నం, ఆర్‌టిసి ఆర్ఎం.సుధాకర్, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ప్రతి నిధులు,రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో ఆర్థిక సంక్షోభం

- బిల్లులు రాక సర్పంచుల ఆవేదన
- అప్పులకు వడ్డీలు చెల్లించలేక
  పార్టీ కార్యక్రమాలకు దూరం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఇటీవలే దర్శి మండలంలోని ఓ మహిళా సర్పంచి ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకుంది. కోటి రూపాయలు వరకూ వెచ్చించి పంచాయతీలో పనులు చేశారు. బిల్లులు రాలేదు.ఆర్థిక కష్టాలతో చివరికి కుటుంబంలోనే పేచీలువచ్చాయి.వడ్డీలు కట్టలేని పరిస్థితి. ఈ గొడవలను తట్టుకోలేక మహిళా సర్పంచి ప్రాణాలు తీసుకున్నారు. జిల్లాలో అన్ని పంచాయతీల్లో సర్పంచులు పరిస్థితి దాదాపుగా ఇలాగే ఉంది. ఎవరూ అడిగే పరిస్థితి లేదు. ఎమ్మెల్యేలకు పట్టడం లేదు. మంత్రులకు ఈ సమస్యలు కనిపించడం లేదు. ఇవే కాకుండా తాగనీటిని సరఫరా చేసే ట్యాంకర్ల కాంటాక్టర్లకూ రూ.132 కోట్లు బకాయిలున్నాయి. వాటి కోసం వాళ్లంతా తిరుగుతున్నారు.వీరిలో సర్పంచులు కూడా వందలాది మంది ఉన్నారు.సర్పంచులు పరిస్థితి ఇలా ఉంది.

పంచాయతీల్లో పైసల్లేవు. ఏ పనులు చేయాలన్నా నిధులు సమస్య వెంటాడుతోంది. ఎందుకు గెలిచామని సర్పంచులు తలలు పట్టుకుంటున్నారు. ఎన్నికల్లో పోటీ చేయక పోయినా బాగుండేదంటూ వాపోతున్నారు. గెలిచాక చేసిన పనులకు బిల్లులు రాకపోగా ఉన్న నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం లాగేసుకుంది. దీంతో పంచాయతీల్లో పనులు చేసిన సర్పంచులు తలలు పట్టుకుంటున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి కూడా వచ్చింది. ఇపుడు కనీసం బ్లీచింగ్ చల్లాలన్నా నిధుల్లేవు.

ఎన్నికల్లో గెలిచాక సర్పంచులు కొత్త ఊపులో రూ.5 నుంచి రూ.10లక్షలు వరకూ వెచ్చించి పనులు చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోనే సుమారు రూ.100 కోట్లకుపైగానే బిల్లులు పెండింగులో ఉన్నాయి. రెండేళ్లు దాటినా బిల్లులు రాలేదు.ఏంచేయాలో దిక్కుతోచని స్థితిలో పార్టీ కార్యక్రమాల్లోనూ ఉత్సాహంగా పాల్గొనలేక పోతున్నారు. పారిశుధ్యం, తాగునీటి పథకాల నిర్వహణ, వీధిదీపాల నిర్వహణ,ఇతర పనులకు అప్పులు తెచ్చి పనులు చేశారు.2021లో పంచాయ తీలకు చెందిన 14వ ఆర్థిక సంఘం నిధులు ప్రభుత్వం నేరుగా వెనుక్కు తీసుకుంది. గతేడాది సెప్టెంబరులో 15 ఆర్థిక సంఘం నిధులు కూడా వచ్చాయి. వీటిని విద్యుత్ బిల్లులతోపాటు పంచాయతీ క్రాప్‌మిత్రలకు వేతనాల కోసంచెల్లించాలని సర్పంచులు, కార్యదర్శులపై వత్తిళ్లు చేశారు. చేసేదేమీ లేక చెల్లించారు. దీంతో పంచాయతీల ఖజానా ఖాళీఅయ్యింది. అరకొరగా ఉన్నా ఆంక్షలు పెట్టి విడుదల కాకుండాచేశారు. అభివృద్ధి పనులకు బిల్లులు పెడితే నిధులు ▶ 2లో

'ఫిష్ ఆంధ్రా' తుస్..

- షాపుల ఏర్పాటుకు
  లబ్ధిదారుల నిరాసక్తి
- 152 దుకాణాలు లక్ష్యం కాగా
  కేవలం 42 ఏర్పాటు
- ఈ నెలాఖరు వరకే గడువు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభిం చిన ఫిష్ ఆంధ్రా-ఫిట్ ఆంధ్రా పథకం జిల్లాలో తుస్ అయ్యేలా ఉంది. ఫిష్ ఆంధ్రా షాపులు పేరుతో చేపల అమ్మకాలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం చాలా చోట్ల నేటికీ ప్రారంభానికి నోచలేదు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద రాష్ట్రంలో ఫిష్ ఆంధ్ర ఫిట్ ఆంధ్రా ప్రోగ్రాంలో భాగంగా జిల్లాకు 152 షాపుల ఏర్పాటు లక్ష్యంగా నిర్ణయించారు. అయితే ఇప్పటి వరకు 42 షాపులు మాత్రమే ఏర్పాటయ్యాయి. మిగిలిన షాపుల ప్రారంభానికి ఈనెలాఖరు వరకే అధికార యంత్రాంగం గడువు నిర్దేశించింది. లబ్ధిదారులు షాపుల ఏర్పాటుకు నిరాసక్తత చూపిస్తున్నారు. అధికారులు ఇప్పటికే షాపుల ఏర్పాటు కోసం ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ ప్రోత్సా హకాలను వివరిస్తున్నప్పటికీ లబ్ధిదారులు ముందుకు రాకపోవడం గమనార్హం.

షాపుల ఏర్పాటు ఇలా..

ఒక్కో షాపు ఏర్పాటుకు రూ. 1.75 లక్షలు అవసరం. అందులో లబ్ధిదారుడు పది శాతం చెల్లించాలి. 40 శాతం ప్రభుత్వం నుంచి సబ్సిడీ అందుతుంది. 50 శాతం బ్యాంకు నుంచి రుణం పొందాల్సి ఉంది. అదే మహిళలు షాపులను ఏర్పాటు చేసుకుంటే డ్వాక్రా సంఘాల ద్వారా రూ. 65 వేలు, లబ్ధిదారుని వాటాగా రూ. 10 వేలు, స్త్రీ నిధి నుంచి రూ. లక్ష రుణం రూపంలో అందిస్తారు. ఫిష్ ఆంధ్రా షాపుల బాధ్యతను మత్స్య శాఖతో పాటుగా మెప్మా, డిఆర్‌డిఎ శాఖలకు కేటాయించినప్పటికీ ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా లక్ష్యం చేరుకోవడం కష్టంలాగే కనిపిస్తోంది.

ఆసక్తి చూపని షాపుల యజమానులు..

ఇప్పటికే ప్రారంభించిన షాపుల యజ మానులు కూడా ఈ పథకం పట్ల ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వం షాపులు ఏర్పాటు చేసుకోమని లబ్ధిదారులను ప్రోత్స హిస్తున్నప్పటికీ షాపులకు చెల్లించే అద్దెలు కూడా ఎక్కువగా ఉండడంతో లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. ఫిష్ ఆంధ్రా షాపులన్నింటికీ చేపలను సరఫరా ▶ 2లో

పర్చూరు వైసిపిలో అంతర్గత పోరు

రేషన్ బియ్యం అక్రమ రవాణా నేపథ్యంలో దాడులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మార్టూరులో జాతీయ రహదారిపై ఉన్న ఒక దాబా వద్ద ఉన్న వైసిపి వర్గీయులపై అదే పార్టీకి చెందిన వారు దాడి చేశారు. ఊహించని రీతిలో అకస్మాత్తుగా జరిగిన దాడిలో నలుగురు గాయపడ్డారు. యద్దన పూడి మండలం పోలూరు, చింతపల్లిపాడు గ్రామాల్లో రేషన్ బియ్యం పంపిణీలో తలెత్తిన వివాదం కారణంగా ఈ దాడి చోటు చేసుకుంది. గ్రామాల్లోనూ పరస్పర దాడులు జరిగే అవకాశం ఉండడంతో యద్దనపూడి, పోలూరు, చింతపల్లిపాడుల్లో పోలీసు బందోబస్తు చేపట్టారు.

పర్చూరు నియోజకవర్గంలోని వైసిపిలో కొద్దికాలం క్రితం జరిగిన రాజకీయ మార్పు, తదనంతర పరిణామాల నేపథ్యంలో అక్కడి పార్టీలో అంతర్గత పోరు తీవ్రస్థాయికి చేరింది. వైసిపి ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలకు రేషన్ బియ్యం అక్రమ దందా, ఇసుక అక్రమ అమ్మకాలు, గ్రావెల్, గ్రానైట్ రవాణాలు వాటిలో వాటాలు ప్రధాన ఆదాయ వనరులుగా ఉన్నాయి. వీటన్నిట్లో కింద స్థాయి నుంచి పెద్ద నాయకుడి వరకూ ప్రతి నెలా క్రమం తప్పకుండా వచ్చే ఆదాయ వనరుగా రేషన్ బియ్యం దందా అమ్మకాలు ఉన్నాయి. పర్చూరులో వైసిపి ఇన్‌ఛార్జిగా రావి రామనాథం బాబు ఉన్న సమయంలో ఎక్కడి వారు అక్కడే ఎవరికి కుదిరినట్లు వారు రేషన్ బియ్యం అమ్మకాలు సాగించి సొమ్ము చేసుకునేవారు. పార్టీలో గ్రూపులు ఉన్నా ఒకరిని మరొకరు నష్టపరుచుకోకుండా సహకరించుకుంటూ ఎవరి శక్తి కొద్దీ వారు సంపాదించుకునే వారు. పైస్థాయి నేతల నుంచి ఎలాంటి జోక్యం ఉండేది కాదు. పర్చూరులో టిడిపి ఎమ్మెల్యే ఉన్నందున వైసిపికి చెందిన నేతలు తమ పనుల కోసం ఇన్‌ఛార్జిగా ఉన్న రామనాథం బాబు దగ్గరకు వెళ్లి సిఫార్సులు చేయించుకునే వారు. రామనాథం బాబు దగ్గరకు వెళ్లనివారు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి లేదా ఎంపీ నందిగం సురేష్ వద్దకు వెళ్లేవారు. పర్చూరు వైసిపి ఇన్‌ఛార్జిగా ఆమంచి కృష్ణమోహన్ భాధ్యతలు చేపట్టిన తర్వాత అక్కడి రాజకీయ పరిస్థితులు మారాయి. అప్పటి ▶ 2లో

పంచాయతీల్లో ఆర్థిక సంక్షోభం

(మొదటిపేజీ తరువాయి)

రావడంలేదు. అన్నీ సిఎఫ్ఎంఎస్ పద్ధతిలో అప్‌లోడ్ చేయడం తప్ప బిల్లులు రావడం లేదు. జిల్లాలో 729 పంచాయతీలు ఉన్నాయి. మైనర్ పంచాయతీలు ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతోనే ఇవి నడవాల్సి ఉంది.ఏటా పంచాయతీలకు తలసరి ఆదాయం లెక్కగట్టి కేంద్రం నిధులు విడుదల చేస్తుంది.15 ఆర్థిక సంఘం నిధులు రూ.45 కోట్లు విడుదలయ్యాయి. వీటిలోనూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బకాయిల కింద రూ.28 కోట్లు జమ చేసుకుంది. మిగతా నిధులను కూడా పంచాయతీలకు కేటాయించలేదు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కింద గ్రామాల్లో నియమించిన క్లాప్ మిత్రలకు వేతనాలు ఇచ్చేందుకు ఈ నిధులనే వినియోగించాలని నిర్ణయించారు. వీరికి కూడా పది నెలలుగా వేతనాల్లేవు.

పంచాయతీలకు కేటాయించిన ఆర్థిక సంఘం నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఏదో రూపంలో దారి మళ్లించింది. గ్రామాలకు వెచ్చించాల్సిన నిధులను పక్కదారి పట్టించారు. దీంతో పంచాయతీలు ఆర్థిక సంక్షోభంలో పడ్డాయి. చేసిన పనులకు బిల్లులు లేవు. కొత్తగా ఏ పనులు చేయాలన్నా కాంటాక్టర్లు ముందుకు రావడంలేదు. సర్పంచులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అప్పులకు వడ్డీలు కట్టలేక ఆస్తులు అమ్ము కుంటున్నారు. ఇళ్లప్లాట్లు బేరాలు పెడుతున్నారు. కొన్నిపంచాయతీల్లో పారిశుధ్యకార్మికులకు వేతనాలు కూడా నెలల తరబడి ఇవ్వడం లేదు.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పంచాయతీలకు నిధులు విడుదల చేయాల్సిన అవసరముంది.

'ఫిష్ ఆంధ్రా' తుస్

(మొదటి పేజీ తరువాయి)

చేసేందుకు జిల్లాకు ఓ ఫిష్ హబ్‌ను కోటి రూపాయలతో ఏర్పాటు చేసి, ఆ హబ్ చేపలను నిల్వచేసి ఫిష్ ఆంధ్రా షాపులకు సరఫరా చేస్తారు. మొదట్లో చెప్పినప్పటికీ నేటి వరకు ఏర్పాటు కాకపోవడంతో షాపులన్నింటికీ నిరంతరం చేపలు అందుబాటులో లేక పోవడంతో ఇప్పటికే షాపులు ప్రారంభించిన లబ్ధిదారులు అద్దెలు భరించాల్సి వస్తుంది తప్ప ఈ పథకం వల్ల లబ్ధిదారులకు ఒరిగేదేమీ లేదని తెలుస్తోంది.

ఫిష్ ఆంధ్రా షాపులతో ఒరిగేదేమీ లేదు

పోతుల ఆదినారాయణ, ముదిరాజు సంఘం పోగ్రాం కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్, వైపాలెం

రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఫిష్ ఆంధ్రా షాపుల వల్ల లబ్ధిదారులకు ఒరిగేదేమీ లేదు. అద్దెలు ఆకాశానంటుతున్నాయి. చేపలకు అవసరమైన నీటి తొట్టి, పరికరాలు, షాపు మోడలింగ్ ఇవన్నీ సమకూర్చుకోవాలంటే చాలా ఖర్చు అవుతుంది. వారిచ్చే సబ్సిడీ ఏ మూలకు సరిపోదు. కేవలం ఈ పథకం ప్రచారం కోసం తప్ప మత్స్య కారులను ఆదుకునేందుకు మాత్రం కాదు.

అవగాహన కల్పిస్తున్నాం

చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి, ఒంగోలు

ఫిష్ ఆంధ్రా షాపుల ఏర్పాటుపై లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే జిల్లాలో 42 షాపులను ప్రారంభించాం. మిగిలిన షాపులు కూడా ప్రారంభం కావడానికి వివిధ దశల్లో ఉన్నాయి. ఆసక్తి ఉన్న వారిని మాత్రమే ప్రోత్సహిస్తున్నాం. ఎవరినీ ఒత్తిడి చేయడం లేదు.

అనాథ వృద్ధాశ్రమానికి విరాళం

ప్రజాశక్తి వేటపాలెం

మండలంలో నీలకంఠపురంలో ఉన్న అనాథ శరణాలయంలో వృద్ధులకు భోజనం పెట్టేందుకు 20 వేల రూపాయల విరాళాన్ని శనివారం అందించారు. ఈ విరాళాన్ని కోనంకి పరబ్రహ్మం మంజు భార్గవి దంపతులు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ కీర్తిశేషులు కోణానికి వెంకట సుబ్బారావు ధర్మపత్ని వెంకటసుబ్బమ్మ భువనగిరి నాగేంద్రరావు వెంకట శేషమ్మ జ్ఞాపకార్థం అందించినట్లు తెలిపారు. అనాథ శరణాలయం కమిటీ పెద్దలైన సత్రం మల్లేశ్వరరావు, గుత్తి విశ్వేశ్వరరావుల చేతికి నగదు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మార్పు గ్రగోరి కమిటీ పెద్దలు గుత్తి విశ్వేశ్వరరావు, మార్పు శాంసన్, విశ్రాంత ఉపాధ్యాయులు చల్ల వాసు, పింజుల రాము, బాపట్ల జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు కుర్మా రాహుల్ జి, యారాస్ అరుణ్ బాబు, బండ్ల బాబు, పృథ్వీ, ఆదిశేషు, మాస్టారులు జగదీష్, సాంబశివరావు పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

సిఎం సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-చెరుకుపల్లి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటన విజయవంతం చేయాలని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. మత్స్యకార భరోసా నిధులను విడుదల చేసేందుకు మే 16వ తేదీన నిజాంపట్నం పర్యటిస్తున్న నేపథ్యంలో రేపల్లె నియోజకవర్గం పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోపిదేవి మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలుకు పలు నియోజకవర్గాలలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేపల్లె నియోజకవర్గంలో పర్యటించడం సంతోషదాయకమని అన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు రత్నప్రసాద్, పార్టీ మండల కన్వీనర్ ఏడుకొండలరెడ్డి, మాజీ ఎంపీపీ చెన్ను కోటేశ్వరరావు, జడ్పిటిసి సభ్యులు మర్రివాడ వెంకటపావని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

గ్రంథాలయాలకు విద్యార్థులు ఇష్టంగా వచ్చి పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని ఉప్పుగుండూరు గ్రంథ పాలకురాలు పి నాగరజని పేర్కొన్నారు. సమ్మర్ కోచింగ్‌లో భాగంగా ఆరో రోజైన శనివారం పాటలు, డ్యాన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం చిత్రలేఖనం నేర్పించారు. ఈ శిక్షణ ద్వారా ఆలోచన పరిజ్ఞానం పెరుగుతుందని అన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి భూరి విరాళం

ప్రజాశక్తి-నగరం

స్థానిక మండల పరిషత్ కార్యలంలో రేపల్లె పట్టణంలో నిర్మిస్తున్న శ్రీ బాబు జగజ్జీవన్ రావు గారి విగ్రహ నిర్మాణానికి బోర మాదిగ పల్లి సర్పంచ్ చందోలు దేవదాస్ గారి కుమారుడు చందోలు నాగమల్లేశ్వరరావు ఇచ్చిన 5 లక్షల రూపాయలు చెక్కును రాజ్యసభ సభ్యులు శ్రీమోపిదేవి వెంకటరమణరావు గారి చేతుల మీదగా కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, చందోలు దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు వైసిపిలో అంతర్గత పోరు

(మొదటిపేజీ తరువాయి)

వరకూ రామనాథం బాబుకు వ్యతిరేకంగా ఉన్నవారు ఆమంచి వైపు చేరారు. పర్చూరు నియోజకవర్గంలోని మండలాల్లో, గ్రామాల్లో కొందరు వైసిపి నేతలు ఆమంచిని కలవకుండా దూరంగా ఉంటూ వచ్చారు. తమకు ఏమైనా సిఫార్సులు అవసరం అయితే మాజీ మంత్రి బాలినేని లేదా ఎంపీ సురేష్‌ను కలుస్తున్నారు. ఆమంచి పర్చూరు వైసిపి పగ్గాలు చేపట్టాక ఆయనతో ఉన్నవారు నియోజకవర్గంలోని మొత్తం ఆదాయ వనరులను అందిపుచ్చుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు.ప్రధానంగా గ్రామస్థాయి నుంచి ఉన్న నేతలకు ఆదాయాన్నిచ్చే రేషన్ బియ్యం దందా మొత్తం ఆమంచి వర్గీయుల చేతుల్లోకి వెళ్ళింది. మొత్తం సరుకు అంతా స్వర్ణ లోని రైస్‌మిల్లు కేంద్రంగా అమ్మకాలు జరగాల్సిందేనని హుకుం జారీ అయ్యింది. ఇతర మిల్లుకు రేషన్ బియ్యం వెళ్ళరాదని నిర్దేశించారు.ఈ నేపథ్యంలోనే సదరు స్వర్ణ రైస్‌మిల్లుపై ఇతర జిల్లాల నుంచి వచ్చిన అధికారులు వరుస దాడులు జరిపారు. అయినా సరే రేషన్ బియ్యం అక్రమ రవాణా ఆమంచి వర్గీయుల నేతృత్వంలో యధేశ్చగా కొనసాగుతోంది. ఈ క్రమంలోనే పోలూరులో రేషన్ బియ్యం పంపిణీ విషయంలో యద్దనపూడి ఎస్‌సి కాలనికి చెందిన మున్నంగి వీరయ్య,సాంబశివరావు మధ్య గొడవ జరిగింది. చింతపల్లిపాడులో జంపని రాజేష్‌కు చెందిన రేషన్ షాపుపై రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల వెనుక ఆమంచి వర్గీయులు ఉన్నారన్నది బాలినేని వర్గీయుల అనుమానం. ఈనేపథ్యంలోనే మార్టూరు వద్ద ఆమంచి వర్గీయులపై దాడి జరిగింది. పర్చూరులో వైసిపి వర్గీయులు రెండుగా చీలిపోయిన నేపథ్యంలో రానున్న రోజుల్లో అంతర్గత పోరు, రేషన్ దందాల ఆధిపత్యంలో భాగంగా దాడులు జరగవచ్చునన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

పంట నష్టంపై వివరాల సేకరణ

ప్రజాశక్తి-వేమూరు

మే నెలలో కురిసిన అకాల భారీ వర్షాల కారణంగా అమృతలూరు మండలంలో దెబ్బతిన్న జొన్న, మొక్కజొన్న పంటలను పరిశీలించి నష్టం అంచనా వేసేందుకు మండల అధికారులు గ్రామాల్లో వివరాలు సేకరించే పని ప్రారంభించారు. శనివారం అమతలూరు మండలం పరిధిలోని పలు గ్రామాలలో ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిని దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతులను పలకరించి వారి గోడు వినేందుకు, జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు మండల అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ సందర్భంగా అమృతలూరు మండలంలోని కూచిపూడి, పెదపూడి, యడఊరు, మూల్పూరు గ్రామాలలో పంట కోసి వర్షం కురిసే సమయంలో గుట్టలుగా వేసి ఉన్న పొలాలు, మిషన్ల ద్వారా మొక్కజొన్నను నూర్పిడి చేసి గింజలను ఇంటికి చేర్చే క్రమంలో వర్షానికి కల్లంలోనే తడిచిన పంటలను వ్యవసాయ మరియు రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఈనెల 16వ తేదీ పంట నష్టం అంచనా మరియు జాబితాలను సిద్ధం చేస్తున్నామని మండల వ్యవసాయ అధికారి వి లోకేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే నష్టం జరిగిన పంట వద్ద రైతు, విఏఏ, వీఆర్వో నిలబడి ఫొటో దిగిన తర్వాత నివేదిక తయారు చేస్తామన్నారు. అనంతరం 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు సామాజిక తనిఖీ కోసం రైతు భరోసా కేంద్రాల వద్ద లబ్ధిదారుల జాబితాను ప్రదర్శిస్తామని ఏవో తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వీ లోకేశ్వరి ఆయా గ్రామాల ,వీఆర్వోలు,వి ఏ ఏలు, రైతులు పాల్గొన్నారు.

వేసవి ఖోఖో శిక్షణలో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులు

పంగులూరులో ఖోఖో వేసవి శిక్షణ

ప్రజాశక్తి-పంగులూరు

ఈనెల ఏడో తేదీ నుంచి పంగులూరు లోని మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో ,ఆంధ్ర ప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ సహకారంతో, బాపట్ల ,ప్రకాశం జిల్లాల ఉమ్మడి స్పోర్ట్స్ అథారిటీల ఆధ్వర్యంలో ఖోఖో వేసవి శిక్షణ శిబిరం జరుగుతుందని, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మేకల సీతారామరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోచింగ్ క్యాంపులో ఉమ్మడి ప్రకాశం జిల్లా నలుమూలల నుండి బాలికలు 30 మంది, బాలురు 40 మంది, పురుషులు 30 మంది, పాల్గొంటారని తెలిపారు. ఈ శిక్షణ ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి, ఎనిమిదిన్నర గంటల వరకు, సాయంత్రం నాలుగున్నర గంటల నుండి ,ఆరున్నర గంటల వరకు జరుగుతుందని, పురుషులకు ఐదు గంటల నుండి, సాయంత్రం 8:30 గంటల వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని సీతారాం రెడ్డి తెలిపారు. ఈ శిక్షణకు కోచ్‌లుగా సీతారామిరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, సీనియర్ క్రీడాకారులు శిక్షణ ఇస్తారని తెలిపారు. జూన్ నెల ఒకటో తేదీ వరకు ఈ శిక్షణ ఉంటుందని సీతారామరెడ్డి చెప్పారు. ఈ శిక్షణకు బాపట్లజిల్లా చీఫ్ కోచ్ కే.ఏ. పాల్ కుమార్, ప్రకాశం జిల్లా చీఫ్ కోచ్ రాజరాజేశ్వరీ లు అనుమతులు తెలిపారని, ఈ సందర్భంగా సీతారామిరెడ్డి వారికి కతజ్ఞతలు తెలిపారు. ఈ శిక్షణ కాలంలో క్రీడాకారులకు ఉచిత భోజన వసతులు కల్పించనున్నట్లు ఆయన చెప్పారు.

అనధికార విద్యుత్ కోతలతో ఇక్కట్లు

ప్రజాశక్తి-చెరుకుపల్లి

అనధికార విద్యుత్ కోతలతో ప్రజలు నరకం అనుభవిస్తున్నారు. గత నాలుగు రోజులుగా మండల పరిధిలో ఎక్కడపడితే అక్కడ అనధికారికంగా విద్యుత్ కోతలు విధిస్తున్నారు. సమయపాలన లేకుండా విధిస్తున్న విద్యుత్ కోతలతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. శుక్రవారం రాత్రి అంతా విద్యుత్ కోతతో వద్ధులు పిల్లలు ఇబ్బందులకు గురయ్యారు. మరలా శనివారం సాయంత్రం వరకు గంటలు తరబడి విద్యుత్ నిలిపివేయడంతో ప్రజల బాధలు వర్ణాతీతంగా మారాయి. ప్రస్తుత వేసవి కాలంలో అనధికార విద్యుత్ కోతలు లేకుండా చూడాలని ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు. నిత్యం ఏదో ఒక రిపేర్ పేరుతో విద్యుత్ నిలిపివేస్తున్నారని మండల ప్రజలు వాపోతున్నారు.

పర్చూరు ఉప విద్యాశాఖాధికారిగా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు ఉప విద్యాశాఖాధికారిగా జి వెంకటేశ్వర్లును నియమిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ యన బాపట్ల డివిజన్ ఉప విద్యాశాఖాధికారిగా పని చేస్తూ పర్చూరు డివిజన్‌కు అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన కిరణ్‌కుమార్ మైనంపాడు డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు.

శింగరాయకొండలో భారీ చోరీ

- రూ.4,60,000 నగదు, 4 సవర్ల బంగారం, వెండి వస్తువులు అపహరణ

ఇంట్లో కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు

చుట్టుపక్కలే తిరిగిన డాగ్ స్క్వాడ్

ప్రజాశక్తి-శింగరాయకొండ

పగలు తాళం వేసి ఉంటే చాలు ఆ ఇల్లు రాత్రికి ఖాళీ అయినట్లే. సీసీ కెమెరాలు ఉన్న జనం నిత్యం రద్దీగా తిరుగుతున్న పోలీసులు సైరన్ మోతలు వినపడ్డ ఆ ఇల్లు ఖాళీ అవ్వాల్సిందే. అదే జరిగింది శింగరాయకొండలో శనివారం పోలీసులు బాధితుల వివరాల ప్రకారం. సింగరాయకొండ గ్రామపంచాయతీ లోని పట్టాభి వారి వీధిలో నివాసముంటున్న కొలకలపూడి సాంబిరెడ్డి అతని భార్య లక్ష్మీప్రసన్న ఈ నెల 10వ తేదీన మనుమరాలి పెళ్లి కావడంతో హైదరాబాద్‌కు వెళ్లారు. తిరిగి శనివారం నాడు ఉదయం సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో దిగి ఇంటికి వచ్చారు. లక్ష్మీ ప్రసన్న గేటు తీసి మిద్ది మీద నివాసం ఉండడంతో గేటు తీసి పైకి ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా గేటు తాళం పగలగొట్టి ఉంది. అనుమానం వచ్చి పైకి వెళ్లి చూడగా ఇల్లంతా చెల్లాచెదురుగా పడి బీరువాలోని సామాన్లు మొత్తం మంచాల మీద పడేసి ఉండడంతో వెంటనే సింగరాయకొండ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఫిరోజా ఫాతిమా, సీఐ దాచేపల్లి రంగనాథ్, ఏఎస్ఐ మహబూబ్ బాషా హుటాహుటానా ఘటన స్థలానికి చేరుకున్నారు. కొలకలపూడి సాంబిరెడ్డితో లక్ష్మీ ప్రసన్నతో మాట్లాడారు. వారి వద్ద ఇంటిలో ఉన్న సామాన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాలుగు లక్షల 60 వేల రూపాయలు నగదు, నాలుగు సవర్ల బంగారం, దేవుని గదిలో వెండి చెంబుతో వెండి కుందులు కూడా తీసుకుపోయారని పోలీసులకు వివరించారు. అయితే దాని పక్కనే ఉన్న ఓ పాత సూట్ కేసులో 20 సవర్లకు పైగా బంగారం ఉందని దాని జోలికి వెళ్లలేదని. దీంతో అటు పోలీసులు కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. దొంగతనం జరిగిన తీరును పరిశీలించి పోలీసులు చుట్టుపక్కల ఉన్న సిసి కెమెరాలపై దృష్టి పెట్టారు. ఇంటి ఎదురుగా ఉన్న ఒక జ్యూవెలరీ షాపులో సీసీ కెమెరాలను పరిశీలించగా అర్ధరాత్రి రెండు గంటల 46 నిమిషాలకు ఇద్దరు వ్యక్తులు ఇంట్లోకి వెళ్లినట్లు, బయట లైట్లు ఆర్పినట్లు సీసీ కెమెరా రికార్డును చూశారు. దీంతో పోలీసుల అప్రమత్తమయ్యారు. భారీగా డబ్బులు పోవడంతో ఒంగోలు నుంచి క్లూస్ టీం సిబ్బందిని, డాగ్స్‌ను కూడా రంగంలోకి దించారు. క్లూస్ టీం సిబ్బంది వేలిముద్రలను సేకరించే పనిలో ఉండగా డాగ్ స్క్వాడ్ ఇంటిలోకి వెళ్లి అన్నీ పరిశీలించి కిందకు వచ్చి ఖాళీ స్థలాల్లోకి వెళ్లి అక్కడ అటు ఇటు తిరిగి పక్కకు వచ్చేసింది. అదేవిధంగా ట్రైనింగ్ ఎస్పీ అంకిత సహోరా, అడిషనల్ క్రైమ్ ఎస్పీ శ్రీధర్‌రావు, ఒంగోలు డిఎస్పి నారాయణస్వామిరెడ్డి, సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్ఐ ఫిరోజా ఫాతిమా దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించి దొంగతనం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాలను పరిశీలించారు. అతి త్వరలోనే దొంగలను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. ఎస్ఐ ఫిరోజా ఫాతిమా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన టిప్పర్.. ఒకరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-పాదిలి

ఆటో, టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామం వద్ద నంద్యాల- ఒంగోలు రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు విచారణ నిమిత్తం ఘటనా స్థలానికి వెళ్లారు. పోలీసు జీబును రోడ్డు పక్కన ఉంచి విచారిస్తున్న సమయంలో వెనుక నుంచి పొట్టు లోడ్‌లో వస్తున్న డిసిఎం వాహనానం పోలీసు జీబును ఢీకొంది. ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టిన ఓ కానిస్టేబుల్ పెద్దగా కేకలు వేయడంతో విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది పక్కకు తప్పుకున్నారు. అనంతరం డిసిఎం పెట్రోల్ బంకు యజమాని మురళి కారును ఢీకొట్టింది. అయితే వాహనంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. డిసిఎం వాహన డ్రైవర్ నిద్రమత్తులో పోలీస్‌జీపును ఢీకొట్టినట్లు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిడిపి సంఘీభావ పాదయాత్రలు: ఆనందబాబు

ప్రజాశక్తి-వేమూరు

నారా లోకేష్ యువగళం పాదయాత్ర 100 రోజుల మైలురాయి చేరుకుంటున్న సందర్భంగా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో సంఘీభావ పాదయాత్రలు నిర్వహించాలని టిడిపి నిర్ణయించిందని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన చుండూరు మండలం యడ్లపల్లిలో టిడిపి మండల నాయకులతో సమన్వయ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నక్కా ఆనంద్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 100 రోజుల మైలురాయి చేరుకుంటున్న సందర్భంగా జాతీయ తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు 175 నియోజకవర్గాల్లో సంఘీభావ పాదయాత్ర నిర్వహించాలని పార్టీ రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని తెలిపారు. అందులో భాగంగానే వేమూరు నియోజకవర్గం చుండూరు మండలం యడ్లపల్లి గ్రామం ఎన్‌టిఆర్ విగ్రహం దగ్గర నుంచి వయా నడిగడ్డపాలెం మీదుగా చుండూరు అంబేద్కర్ నగర్ దగ్గర గల అంబేద్కర్ విగ్రహం వరకు, ఈ నెల 15వ తేదీ ఉదయం 7 గంటలకు పాదయాత్ర జరుగుతుందన్నారు. ఈ పాదయాత్రకు వేమూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సంఘీభావ పాదయాత్రను విజయవంతం చేయటానికి ఈ సమావేశం వేదికగా నాయకులకు దిశా నిర్దేశం చేశారు. కమిటీ సమావేశంలో వేమూరు నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతలు, చుండూరు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

ప్రజాశక్తి-నిజాంపట్నం : మండలంలోని మొక్కజొన్న రైతులను ప్రభుత్వ ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. కూచినపూడి పంచాయతీలో సుమారు 200 ఎకరాలు మొక్కజొన్న పంట లకు రైతులకు తీరని నష్టం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం అకాల వర్షాలకు నష్టపోయిన రైతులని ప్రభుత్వ ఆదుకుని తడిసిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందిస్తామని, రైతు వద్ద ఎటువంటి డాక్యుమెంట్ లేకపోయినా ఈ క్రాప్ చేయకపోయినా రైతును అన్ని విధాల ఆదుకుంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్వయంగా ప్రకటించిన కింది స్థాయి అధికారుల వల్ల రైతులకు తీరని నష్టం జరుగుతూనే ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈక్రాప్ మరియు క్రాప్ బుకింగ్ డాక్యుమెంట్స్ లేని, నష్టపోయిన రైతులను ఆదుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. పంచాయతీకి పంచాయతీకి మధ్య అధికారులు వ్యత్యాసం చూపిస్తుంటే రైతులు ఇంకెవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. ఈ విషయాలను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

ప్రజాశక్తి-వేమూరు: వేమూరు మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు కురిసిన అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న మొక్కజొన్న, జొన్న పంటలను రేపల్లె వ్యవసాయ ఉపసంచాలకులు సయ్యద్ అక్తర్ హుస్సేన్, స్థానిక వ్యవసాయ అధికారులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రేపల్లె ఎడిఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్ మాట్లాడుతూ రైతులందరికీ ప్రభుత్వం జొన్న, మొక్కజొన్నలకు మద్దతు ధర కల్పిస్తుందని అన్నారు. మొక్కజొన్న పంటకు క్వింటాలుకు రూ.1,962కు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు. రైతులందరూ తప్పనిసరిగా రైతు భరోసా కేంద్రాల్లో తమ ఆధార్, ఆధార్ కార్డు కార్డు లింక్ చేసిన ఫోన్ నెంబరు తీసుకువెళ్లి పంట నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే వర్షాల వలన మొలకెత్తిన మొక్కజొన్న, జొన్నలు 30 శాతం పైగా బూజు పట్టిన గింజలు ఉన్నచో సంబంధిత రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి వ్యవసాయ విస్తరణ అధికారులను, వ్యవసాయ సహాయకులను సంప్రదించి పంట వివరాలు నమోదు చేయించుకోవాల్సిందిగా సూచించారు. రేపల్లె ఏడీఏతో పాటుగా వేమూరు మండల వ్యవసాయ అధికారులు, వీఏవోలు పాల్గొన్నారు.

రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ కర్న లక్ష్మణరావు కన్నుమూత

ప్రజాశక్తి-వేటపాలెం

రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ కర్న లక్ష్మణరావు (88) వయో భారంతో శనివారం సహజ మరణం పొందారు. చీరాల తహశీల్దారుగా, కందుకూరు ఆర్‌డిఓగా ఆయన పనిచేశారు. 1993లో డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉద్యోగ విరమణ చేశారు. చీరాల స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్‌గా మూడుసార్లు 65 సంవత్సరాల వయసు వచ్చే వరకు పని చేశారు. స్థానికంగా ప్రసిద్ధి చెందిన బండ్ల బాపయ్య విద్యా సంస్థల కమిటీ సెక్రటరి అండ్ కరస్పాండెంట్‌గా పని చేశారు. ప్రోబస్ క్లబ్ ఛైర్మన్‌గా మండల పరిధిలోని దేశాయిపేట ఉమ్మిటి శివయ్య ఐటిఐ కాలేజ్ సలహాదారునిగా సేవలు అందించారు. వేటపాలెం పరిసర ప్రాంతాల్లో కర్న లక్ష్మణరావు పేరు తెలియని వారు ఉండరు. లక్ష్మణరావుకు సంవత్సరం క్రితం సతీమణి వీరమాంబ మృతి చెందారు. ఈ మధ్య భార్య సంవత్సరీకం కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు నిర్వహించారు. లక్ష్మణరావుకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. పెద్ద కొడుకు వీర్రాజు చీరాల ఏకెపి జూనియర్ కాలేజ్ ఒకేషనల్ జెఎల్‌గా రిటైర్ అయ్యారు. చిన్న కుమారుడు శ్రీనివాసరావు కృష్ణా జిల్లాలో డ్రైనేజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. కుమార్తె ప్రశాంతి అమెరికాలోని వాషింగ్టన్ యూనివర్సిటీలో రీసెర్చ్ స్కాలర్‌గా ఉన్నారు. లక్ష్మణరావు మృతి చెందిన విషయం తెలుసుకొన్న బంధువులు, ఆయనతో అనుబంధం ఉన్న ప్రజలు విషాదంలో మునిగిపోయారు. సాయంత్రం నాలుగు గంటలకు లక్ష్మణరావు దహన సంస్కారాలు నిర్వహించారు.

టిడిపి కార్యకర్త మృతికి సంతాపం

ప్రజాశక్తి-వేమూరు: అమృతలూరు మండలం కూచిపూడి కి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త కార్యకర్త మేకా నాగేశ్వరరావు భార్య మేకా ఆషా పార్థివ దేహానికి మాజీ మంత్రి నక్కా ఆనందబాబు శనివారం నివాళులర్పించారు. మేక నాగేశ్వరరావు భార్య ఆషా అనారోగ్యంతో చాలా చిన్న వయసులో మరణించడం బాధాకరమైన విషయమని మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఏ అవసరం ఉన్నా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆనంద్‌బాబుతో పాటు అమృతలూరు మండల, కూచిపూడి గ్రామ పరిధిలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో సాఫ్ట్ వేర్ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి-మద్దిపాడు

ప్రమాదవశాత్తూ సాఫ్ట్ వేర్ ఉద్యోగి విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఘటన శనివారం స్థానిక ఆయిల్ మిల్లులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. స్థానిక పడమరపాలేనికి చెందిన అజయ్ (24) చెన్నయ్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. హనుమజ్జయంతి సందర్భంగా మద్దిపాడు వచ్చారు. శనివారం పాత ఆయిల్ మిల్లు వద్దకు వచ్చి జనరేటర్ రూమ్ పైకి మిత్రులతో ఎక్కి ఫోను మాట్లాడుతుండగా పక్కనే ఉన్న 11 కెవి విద్యుత్ లైన్ ఆకర్షించడంతో కింద పడి షాక్‌తో మృతి చెందినట్లు సమాచారం. అతడిని వెంటనే స్థానిక పిహెచ్‌సికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పిఎం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఎస్ఐ బి శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సంతనూతలపాడులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఈ నెల 14వ తేదీన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్ వైవి రావు గుండె వైద్య నిపుణులు (ఉష కార్డియాక్ సెంటర్ విజయవాడ వారి గుండె వైద్య నిపుణుల వైద్య బృందం) పాల్గొంటారని, ఈ అవకాశాన్ని సంతనూతలపాడు మండలం, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవలసినదిగా సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ వారు కోరారు.

నేడు మద్దిపాడులో వైద్య శిబిరం

ప్రజాశక్తి-మద్దిపాడు

ఒంగోలు ఏపికే హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం స్థానిక నటరాజ కళాకేంద్రంలో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ శిబిరంలో డాక్టర్ కల్లూరి వెంకటేశ్వరరావు, డాక్టర్ వడ్డమూడి అపర్ణ పాల్గొంటారని తెలిపారు. షుగర్ బిపి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

జక్కుల ఆంజనేయులుకు నివాళి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని చేకూరపాడు గ్రామ ఎస్సి కాలనీలో అనారోగ్యంతో మరణించిన టిడిపి నాయకులు జక్కుల ఆంజనేయులు భౌతిక కాయాన్ని శనివారం సంతనూతలపాడు మాజీ ఎంఎల్ఏ బిఎన్ విజయకుమార్ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు తేళ్ల మనోజ్ కుమార్, గ్రామ సర్పంచ్ కొమ్మినేని రమేష్ బాబు, నియోజకవర్గ రైతు అధ్యక్షులు ఇంటూరి శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు మోహన్, జార్జి, పరుసు బుజ్జి తదితరులు నివాళులర్పించారు.

మనస్తాపంతో బాలిక ఆత్మహత్య

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని గొట్లగట్టు గ్రామానికి చెందిన మైనర్ బాలిక మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చోటు చేసుకుంది. ప్రేమ వ్యవహారమే ఇందుకు కారణమని తెలుస్తోంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలో ఉచిత విద్య కోసం ఒకటో తరగతి ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ సనత్ కుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశ ప్రవేశాలు కల్పించాలన్న నిబంధనతో ఈ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఐదు సంవత్సరాలు నిండిన విద్యార్థి ఈనెల 15వ తేదీ లోపు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. విద్యార్థి ఆధార్ కార్డు ఫోటో ఇన్‌కమ్ సర్టిఫికెట్ లేదా రేషన్ కార్డులతో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 9550892191 నంబరులో సంప్రదించాలని ఆయన తెలిపారు.

సోమవారం స్పందన తాత్కాలికంగా రద్దు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఈ నెల 16వ తేదీన బాపట్ల జిల్లా నిజాంపట్నంకు వైఎస్ఆర్ మత్స్యకార భరోసా నగదు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి వస్తున్న నేపథ్యంలో 15వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లో, జిల్లా ఎస్‌పి కార్యాలయంలో జరగనున్న స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా,జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌లు వేరువేరు ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి సుదూర ప్రాంతాల నుంచి సోమవారం బాపట్లకు రావద్దని తెలిపారు.

వధూవరులకు మాజీ మంత్రి ఆశీర్వాదం

ప్రజాశక్తి-వేమూరు

అమృతలూరు మండలం యలవర్రు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త నారిశెట్టి శోభన్‌బాబు కుమారుని వివాహ వేడుకలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. అమృతలూరు మండలం యలవర్రు గ్రామానికి చెందిన లూథరన్ చర్చిలో శనివారం ఈ వివాహ వేడుక జరిగింది. ఇందులో పాల్గొన్న మాజీ మంత్రి నక్కా ఆనందబాబు నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అమృతలూరు మండలం యలవర్రు గ్రామ పరిధిలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లులో మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి మేనేజింగ్ కమిటీ అధ్యక్షులు మాదాల బాల శ్రీనివాసరావు, వాసవీక్లబ్ దోగిపర్తి అయ్యప్పస్వామి, క్లబ్ అధ్యక్షులు చిన్ని పూర్ణారావు, కార్యదర్శి దోగిపర్తి బదిరీ నారాయణ, కోశాధికారి బైసాని నరశింహాశెట్టి, మాజేటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు ఉచిత మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-నగరం

సేవా కార్యక్రమాలు మహిళలు చేపట్టడం అభినదనీయమని రూరల్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం నెహ్రూ బొమ్మ సెంటర్‌లో పట్టణ తెలుగుదేశం పార్టీ మహిళా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలో ముందు ఉండటమే కాకుండా సేవా రంగంలో కూడా ముందు ఉండటం అభినందనీయం అన్నారు. శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్ సేవా కార్యక్రమాలు చేపట్టే వారిని మరింత ప్రోత్సహిస్తూ మరెన్నో సేవా కార్యక్రమం చేయడానికి సహాయ సహకారాలు అందిస్తారని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో రేపల్లె పట్టణం మహిళా అధ్యక్షులు గౌరీ రామ కుమారి, మోర్ల అరుణకుమారి, జి.వి నాగేశ్వరరావు, మోర్ల వారిపాలెం మాజీ సర్పంచ్ మోర్ల అంజయ్య, వెనిగళ్ళ శివ సుబ్రహ్మణ్యం, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల సముద్రతీరం సూర్యలంకలో నూతనంగా నిర్మించిన తారకేశ్వర ఆలయం ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్న ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి, కలెక్టర్ పి రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

విద్యారంగాన్ని కాపాడుకుంటేనే ప్రగతి

ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ప్రస్తుత విద్యా విధానంలో కొనసాగుతున్న సంస్కరణలు, నూతన విద్యా విధానం పోకడలు, విద్యావ్యవస్థను పక్కదారి పట్టిస్తున్నాయని కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ఇంకొల్లు మండలం గంగవరం గ్రామంలోని శ్రీ మంచాల రంగయ్య, రమణమ్మ కళ్యాణ మండపం ఆవరణలో దాచూరి రామిరెడ్డి స్మారక చర్చా వేదికలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. 400 యూనివర్సిటీలను ప్రైవేటీకరణ చేసి ప్రైవేటు వారి చేతుల్లో పెట్టిందని కేంద్ర ప్రభుత్వంపై ఆయన నిప్పులు చెరిగారు. విద్య పేదవాడికి దూరం చేసేలా వ్యవస్థలు ఉన్నాయన్నారు. ప్రైవేటీకరణ జరిగినా కూడా పేదవానికి విద్య అందేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. నూతన విద్యా విధానంలో పాఠశాలలు మూసివేతతో పాటు, పాఠ్యాంశాలను మార్చి వేసి విద్య కాషాయీకరణ దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రం నిర్ణయానికి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎయిడెడ్ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఉన్న ఎయిడెడ్ విద్యా సంస్థలను మూసివేసే పనిలో ప్రభుత్వాలు ఉన్నాయన్నారు. తద్వారా దాతల ఆశలు నీరుగారి పేదలకు విద్య దూరం అవుతుందన్నారు. విద్యా రంగంలో వస్తున్న విధానాలపై ఇటీవల బడికోసం బస్సుయాత్ర చేసి సమస్యలు, వాస్తవాలను గుర్తించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చిన్న పిల్లలను హైస్కూళ్లలో విలీనం చేయటం సరైన విధానం కాదని అన్నారు. 117 జిఒ వల్ల ఉపాధ్యాయులను తగ్గించే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేస్తోందన్నారు. యాప్‌ల పని భారం తగ్గించి ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పేలా చూడాలని సూచించారు. కర్ణాటక ఫలితాల్లో బిజెపికి ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. సభకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సదస్సులో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వలేటి కృష్ణయ్య, సిఐటియు రాష్ట్ర నాయకులు వై సిద్దయ్య, సదస్సు నిర్వాహకులు డాక్టర్ మంచాల రమేష్ బాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, కందిమళ్ల రామకోటేశ్వరరావు, కౌలు రైతు సంఘం కార్యదర్శి రాయిని వినోద్, యుటిఎఫ్ నాయకులు షేక్ మస్తాన్‌వలి, యు చెంచయ్య, ఎ శ్రీమన్నారాయణ, కరి కమలేశ్వరరావు, హనుమంతరావు, శివరామకృష్ణ, సుబ్బారావు పాల్గొన్నారు.

గంగవరంలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

పంగులూరులో రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య

రైతాంగం పోరాటాలకు సిద్ధం కావాలి

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య

ప్రజాశక్తి-పంగులూరు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, రైతాంగమంతా ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య కోరారు. శనివారం సాయంత్రం పంగులూరులో రైతు సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని పలువురు రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగా రాష్ట్రంలో వ్యవసాయం సంక్షోభంలో పడిపోయిందని, రైతులు అప్పుల ఊబిలో కూరుకుని పోయారని అన్నారు. ఒకవైపు పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోగా, మరోవైపు అకాల వర్షాలు వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని కష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు, తమ బాధ్యతలను పూర్తిగా వదిలేసి రైతాంగాన్ని, వ్యవసాయాన్ని పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. సహజ వనరులను అదాని, అంబానీలకు దారదత్వం చేసి, మోడీ దేశ ప్రజలకు మొండి చేయి చూపుతున్నారని అన్నారు. ప్రభుత్వ రంగంలో ఉండే అన్ని కంపెనీలను ప్రైవేటీకరించి, ప్రజల ఆస్తులను అమ్మేయాలని చూస్తున్నాడని విమర్శించారు. చట్టాలను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మలిచేందుకు నాలుగు నల్ల చట్టాలు చేసి, వ్యవసాయాన్ని రైతాంగాన్ని దివాలా దించే ప్రయత్నం కేంద్ర బిజెపి ప్రభుత్వం చేసిందని ,దీనికి వ్యతిరేకంగా ఏడాదికి పైగా రైతాంగం పోరాడి నల్ల చట్టాలను రద్దు చేయించుకున్న సందర్భాన్ని కష్ణయ్య ఈ సందర్భంగా గుర్తు చేశారు. రైతాంగమంతా ఐక్యంగా ఉంటే ప్రభుత్వాలు కూడా దిగిరాక తప్పదని అన్నారు. పోరాటాలు చేయటం ఈ ప్రాంత రైతాంగానికి కొత్త కాదని, భవిష్యత్తులో రైతు సంఘం తీసుకుపోయే ఆందోళనలు, పోరాటాలు, ఉద్యమాలకు, రైతాంగం సహకరించాలని కోరారు .ఈ కార్యక్రమంలో రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిని వినోద్‌బాబు, ఆదుంసాహెబ్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ స్థాయి క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-పర్చూరు: ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి క్రికెట్ పోటీలు పర్చూరు ప్రాంత క్రీడాభిమానులకు ఉత్సాహాన్ని కల్పించనున్నాయి. ఏలూరి యూత్ స్పోర్ట్స్ కల్చరల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సహకారంతో నేటి నుంచి ఈ నెల 21వ తేదీ వరకు పోటీలు నిర్వహిస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షులు తులసి శ్రీనివాసరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు షేక్ షంషుద్దీన్ తెలిపారు. స్థానిక తెలుగుదేశం పార్టీ ఆవరణలో సమావేశం నిర్వహించారు. జాతీయ స్థాయి టి-20 పోటీల్లో దేశవ్యాప్తంగా 16 జట్లు పాల్గొంటున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతంలో జాతీయ స్థాయిలో పెద్దఎత్తున నిర్వహిస్తున్న పోటీల్లో ఐపిఎల్, రంజి పోటీల్లో ఆడిన వారితో సహా 250 మంది క్రీడాకారులు హాజరవుతున్నారన్నారు. ఎన్‌టిఆర్ అభిమానులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, క్రీడాభిమానులు పోటీలను దిగ్విజయం చేయాలని కోరారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.5 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.3 లక్షలు, తృతీయ బహుమతి రూ.2 లక్షలు, చతుర్థ బహుమతి రూ. లక్ష రూపాయలు, మ్యాన్ ఆఫ్‌ది సిరీస్‌గా ఎంపికైన వారికి బుల్లెట్ ద్విచక్ర వాహనం ఇవ్వనున్నట్లు తెలిపారు. వ్యాఖ్యాతలను, ఎంపైర్లను ఇతర రాష్ట్రాల నుంచి పిలిపిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్రాలకు చెందిన క్రికెట్ జట్లు పాల్గొంటున్నట్లు వివరించారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటలకు ఒక మ్యాచ్, మధ్యాహ్నం ఒంటిగంటకు మరో మ్యాచ్ ఉంటుందన్నారు. ట్రస్ట్ కార్యదర్శి మామిడిపాక హరిప్రసాద్, కోశాధికారి చెరుకూరి చింపయ్య, నాయకులు కోడూరి శేషబ్రహ్మాచారి, ఏవి కృష్ణ, ఎం హరిబాబు, రవిచంద్ర, నాగేశ్వరరావు, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలి

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్: రాష్ట్రంలో ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఇంకొల్లు మండలం గంగవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంతోకాలంగా ఉపాధ్యాయ బదిలీల కోసం ఉపాధ్యాయులు ఎదురు చూపులు చూస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బదిలీలు చేయటంతో విఫలమైందన్నారు. పాత జీఓలు రద్దు చేసిన పిదప కొత్త జి.ఓలు జారీ చేసి బదిలీలు వెంటనే చేపట్టాలన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు గుర్తించి డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. ఇటీవల ప్రకటించిన '98 డిఎస్సీలో పారదర్శకత లేదన్నారు. 6,800 మందికి సర్టిఫికెట్లు పరిశీలించి 4,072 మందికి మాత్రమే ఉద్యోగాలు ఇచ్చారన్నారు. మిగిలిపోయిన అభ్యర్థులకు కూడా ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. బల్లికురవ ఎంఇఒగా పనిచేస్తున్న బండ్ల వీర రాఘవయ్య అవినీతికి పాల్పడుతున్నాడన్నారు. ఈపాటికే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. వీరరాఘవయ్యపై ఆర్‌జెడి చర్యలు తీసుకోవాలని లక్ష్మణరావు డిమాండ్ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణరావు

అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

నగరంలోని వివిధ ప్రాంతాల్లో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను కమిషనర్ వెంకటేశ్వరరావు శనివారం పరిశీలించారు. తొలుత రూ.19 లక్షలతో అగ్రహారం రైల్వే ఏరియాలో జరుగుతున్న పైప్‌లైన్ లీకేజి మరమ్మతుల పనులను పరిశీలించారు. అనంతరం కేశవరాజుకుంటలో సుమారు రూ.86 లక్షలతో నిర్మాణంలో ఉన్న మురుగు కాలువను పరిశీలించారు. గోపాలనగర్‌లో రూ.27 లక్షలతో నిర్మాణంలో ఉన్న మిని బైపాస్ రోడ్డు పనులను పరిశీలించారు. సంఘమిత్ర హాస్పిటల్ సమీపంలోని కాసు బ్రహ్మానందరెడ్డి విగ్రహం వద్ద ఎన్‌సిఎపి నిధులతో చేపట్టిన పనులను పరిశీలించారు. అనంతరం భాగ్యనగర్ ప్రాంతంలో రూ.1.2 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న రోడ్లు, కాలువ పనులను పరిశీలించారు. ఎన్‌సిఎపి నిధులతో భాగ్యనగర్‌లో పార్కు నిర్మించేందుకు

కాలువ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

అంచనాలు తయారు చేయాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులకు సూచించారు. 19వ డివిజన్ పరిధిలోని మోడల్ టౌన్‌లో నిర్మాణంలో ఉన్న కాలువ పనులను పరిశీలించారు. రూ.15 లక్షల వ్యయంతో ఇరిగేషన్ కెనాల్‌పై నిర్మిస్తున్న కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిపై ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కమిషనర్ సమీక్షించారు. అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కమిషనర్ వెంట 19వ డివిజన్ కార్పొరేటర్ ఈదర వెంకట సురేష్‌బాబు, కార్పొరేటర్లు చల్లా తిరుమలరావు, ఎందేటి పద్మావతి రంగారావు, ఇంజినీర్ కె మాల్యాద్రి, డిఇఇ గణపతి, పద్మజ, రఘురాం, ఎఇ అంజిరెడ్డి, బాలకోటయ్య, సచివాలయ ఎమినిటిస్ సెక్రటరీలు తితరులు ఉన్నారు.

సేవా కార్యక్రమాలతో..

శిద్దా వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-చీమకుర్తి

కృష్ణసాయి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత శిద్దా వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు సేవా కార్యక్రమాలతో కార్మికులు, ఉద్యోగుల మధ్య శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణసాయి క్వారీలో కృష్ణసాయి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేతలు శిద్దా హనుమంతరావు, శిద్దా భరత్, ఉదయ్ భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. బూదవాడ గ్రామ పంచాయతీకి పారిశుధ్య పనులు కోసం రూ.10లక్షల విలువైన ట్రాక్టరును శిద్దా హనుమంతరావు, శిద్దా భరత్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మరియమ్మ,వైస్ సర్పంచి మేదరమెట్ల శ్రీనివాసులు, ఎంపిటిసి పాపిరెడ్డి, కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.ఒంగోలు-కర్నూలు రోడ్డు ప్రక్కన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శిదా భరత్ ప్రారంభించారు. కృష్ణసాయి గ్రూప్ ఆఫ్ కంపెనీలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులకు బోనస్‌లు పంపిణీ చేశారు.క్వారీలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 30 మంది రక్తదానం చేశారు.ఈ శిబిరాన్ని శిద్దాభరత్ ప్రారంభించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణసాయి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేతలు శిద్దా హనుమంతరావు, శిద్దా భరత్,ఉదయ్, జనరల్ మేనేజర్ మురళీమోహనరావు,మేనేజర్లు కమలాకర్, శ్రీనివాసులరెడ్డి,ఆంజనేయులు పాల్గొన్నారు.

బూదవాడ పంచాయతీకి ట్రాక్టరును బహూకరిస్తున్న శిద్దా హనుమంతరావు,శిద్దా భరత్

శరవేగంగా శత జయంతి సభ ఏర్పాట్లు

ప్రజాశక్తి-టంగుటూరు

కొండపి నియోజకవర్గ స్థాయి ఎన్‌టిఆర్ శతజయంతి సభను ఈనెల 15న టంగుటూరు-ఒంగోలు రోడ్డులోని రావూరి పేరయ్య కంపెనీ ఆవరణలో నిర్వహించనున్నారు. అందులో భాగంగా ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. నియోజకవర్గ పరిధిలోని 6 మండలాల నుండి 6వేల మందికి పైగా ఎన్‌టిఆర్ అభిమానులు, టీడీపీ కార్యకర్తలు హాజరవుతారని పార్టీ అంచనా వేసింది. దీనికి తగ్గట్లుగా సభాస్థలిలో స్టేజీ, భోజనశాల వేసవిలో కార్యకర్తలకు ఉపశమనం కలిగించేలా మజ్జిగ, ఇతర శీతల పానీయాలను అందరికి అందేలా ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని 6 మండలాల నాయకులు ఇప్పటికే టంగుటూరు శతజయంతి సభకు కార్యకర్తలు, ఎన్‌టిఆర్ అభిమానులు భారీగా హాజరయ్యేలా మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్వాగత ఫ్లెక్సీలతో ఇప్పటికే టంగుటూరు ప్రత్యేక ఆకర్షణతో ముస్తాబైంది. కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య సభా వేదిక ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ మండల నాయకులను అప్రమత్తం చేస్తున్నారు. ఎన్‌టిఆర్ శతజయంతి నియోజకవర్గ స్థాయి సభను విజయవంతం చేసేందుకు టంగుటూరు మండల పట్టణ టిడిపి అధ్యక్షులు కామని విజయకుమార్, కామని నాగశ్రీను, మండల తెలుగు యువత అధ్యక్షుడు అబ్బూరి అభిషేక్ అహర్నిశలు శ్రమిస్తున్నారు.

సభ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

పేదల సంక్షేమమే ధ్యేయం : బూచేపల్లి

ప్రజాశక్తి-చీమకుర్తి

పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. మండలంలోని చంద్రపాడులో రూ.40 లక్షలతో నిర్మించిన పంచాయతీ కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే టిజెఆర్. సుధాకరబాబు,మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డితో కలిసి వెంకాయమ్మ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సారధ్యంలో ప్రభుత్వ పాఠశాలలు,ప్రభుత్వ కార్యాలయాలు కొత్తరూపు దిద్దుకున్నాయని తెలిపారు. ప్రజలకు ఉత్తమ సేవలందించే దిశగా పనులు వేగంగా సాగుతున్నాయన్నారు.అనంతరం మూడవవార్డులో ఆవార్డు కౌన్సిలర్ భీమన వెంకటరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గడప గడపకూ కార్యక్రమంలో బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే సుధాకరబాబు,మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు. గడప గడపకూ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు,ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు, చంద్రపాడు ఎంపిటిసి అంజిరెడ్డి, సర్పంచి అంకయ్య, వైసిపి మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు,కె.శేఖరరెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు. **మర్రిపూడి :** పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని కెల్లంపల్లి సచివాలయం పరిధిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పరిష్కరించడానికి వర్చువల్ విధానంలో జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. స్పందన కన్నా ఎక్కువగా జగనన్నకు చెబుదామనే కార్యక్రమాన్ని నిర్వహిస్తారనిఅన్నారు. పెన్షన్లు, రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ, రెవెన్యూ మొదలగు అంశాలపై ఏమైనా సమస్యలు ఉంటే 1902 కాల్‌సెంటర్‌కు ఫోన్ చేసి తెలపాలని సూచించారు. అనంతరం ఇంటింటికీ తిగిరి ప్రజలు సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వాకా వెంకటరెడ్డి, వైసిపి నాయకులు బోగసముద్రం విజయభాస్కర్‌రెడ్డి, చిమట సొసైటీ మాజీ అధ్యక్షుడు మొల్లల శివరామిరెడ్డి, సర్పంచులు కొడవగంటి జ్యోతమ్మ, మేళం శివన్నారాయణ, వైసిపి మండల యూత్ నాయకుడు వనిపెంట మల్లికార్జున, చెరుకూరి శ్రీనివాసులు, అలికేపల్లి వెంకటరెడ్డి, ముప్పరాజు హరిబాబు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయ భవన ప్రారంభోత్సవంలో బూచేపల్లి వెంకాయమ్మ

ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న అశోక్‌బాబు

మంత్రి సురేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డిఎస్‌పి

మంత్రిని కలిసిన డిఎస్‌పి

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం డిఎస్‌పిగా జి.వీరరాఘవరెడ్డి బాధ్యతలు చేపట్టారు. అందులో భాగంగా మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను డిఎస్‌పి వీరరాఘవరెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని సురేష్‌ను శాలువాతో సత్కరించి పూలబొకే అందించారు. మార్కాపురం సబ్ డివిజన్‌లో శాంతిభద్రతలు కాపాడేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని మంత్రి డాక్టర్ సురేష్ కోరారు.

మహిళకు రక్తదానం

ప్రజాశక్తి-చీమకుర్తి

భగత్‌సింగ్ బ్లడ్ డోనర్స్ ఆధ్వర్యంలో ఓ మహిళ రక్తదానం చేశారు. పొదిలికి చెందిన సిహెచ్.లక్ష్మమ్మ ఆపరేషన్ నిమ్మితం రక్తం అవసరమైంది. భగత్‌సింగ్ డోనర్స్ ఆధ్వర్యంలో డి.వెంకయ్య రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి జి.దేవరాజు మాట్లాడుతూ అత్యవసర సమయాలలో భగత్‌సింగ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ముందుంటుందని తెలిపారు.

నేడు కెవిపాలెం ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల

- పోటాపోటీగా విద్యుత్ ప్రభల ఏర్పాటు

- సిపిఎం,ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో కార్యక్రమాలు

ప్రజాశక్తి-చీమకుర్తి

కెవిపాలెం ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం తిరునాళ్ల ఆదివారం జరగనుంది. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేస్తున్నట్లు .టిడిపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభపై ఈటివి జబర్దస్త్ టీం కళాకారులు,సినీ, టివి కళారులచే కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. వైసిపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ ప్రభపై లక్కీ ఆర్టిస్టటీం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

సిపిఎం కెవిపాలెం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో

సిపిఎం కెవిపాలెం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ప్రజానాట్యమండలి సహకారంతో సంస్కృతిక కార్యక్రమాలు, కళారూపాలు ప్రదర్శనలు తిరునాళ్ల సందర్భంగా ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా ప్రజాచైతన్య రూపాలు ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు.నంద్యాల జిల్లా ,అనంతపురం జిల్లాల నుంచి కళాకారులు తమ కళారూపకాలతో అలరించనున్నారు. సామాజికతత్వవేత్తలు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ,యోగి వేమన, గురజాడ నృత్య రూపకాలు, కళారూపాలు ప్రదర్శనకు సిద్ధం చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న కళారూపకాలు కార్యక్రమంలో పాల్గొనటానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్ కుమార్, సీనియర్ నాయకులు జగన్ పాల్గొననున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రజలకు అన్ని సౌకర్యాలు,అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు.

రవిబాబుకు అభినందనలు

ప్రజాశక్తి-టంగుటూరు

రాష్ట్ర మాల సంక్షేమ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మండల పరిధిలోని వాసేపల్లిపాడు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు లింగంగుంట రవిబాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ మాలల సంక్షేమం, అభివద్ధే లక్ష్యంగా కృషి చేస్తామని తెలిపారు. పేర్కొన్నారు. ఈ సందర్భంగా రవిబాబుకు పలువుఉరు శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించారు.

లోక్ అదాలత్‌లో 648 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-మార్కాపురం

జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం నిర్వహించిన జాతీయ లోకదాలత్‌లో 648 కేసులను పరిష్కరించారు. మార్కాపురం మండల న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షులు, 7వ అదనపు జిల్లా జడ్జి టి.రాజా వెంకటాద్రి ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. కోర్ట్ ప్రాంగణంలో కక్షి దారులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా వెంకటాద్రి మాట్లాడుతూ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తద్వారా విలువైన సమయంతో పాటు ఆర్థిక నష్టాన్ని మిగుల్చుకోవచ్చని సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 648 కేసులు పరిష్కరించారు. సివిల్ కేసులు 11 పరిష్కరించి బాధితులకు రూ. 21,73,000 పరిహారం ఇప్పించారు. క్రిమినల్ కేసులు, ఐపిసి కేసులు 30, చెక్‌బౌన్స్ కేసులు 7 పరిష్కరించారు. రూ. 6,50,000 పరిహారం ఇచ్చేలా రాజీ

మాట్లాడుతున్న జడ్జి

కుదిర్చారు. 100 అడ్మిషన్ కేసులు పరిష్కరించి రూ. 30,000 పరిహారం ఇప్పించారు. 500 ఎస్‌టిసి కేసులు పరిష్కరించి రూ. 66,750 పరిహారం ఇప్పించారు. లోక్ అదాలత్‌ను రెండు బెంచీలుగా ఏర్పాటు చేసి రాజా వెంకటాద్రి మరియు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌ఎంజకరిముల్లా, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శాంతకుమారి ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. సీనియర్ న్యాయవాదులు ఎ.ఉషశ్రీ, టి.వెలుగొండయ్య, షేక్ కరీమున్నిసాబేగం, డి.సురేష్‌లు బెంచి మెంబర్లుగా వ్యవహరించారు. **దర్శి :** కక్షిదారులకు రాజీయే రాజమార్గమని సీనియర్ సివిల్ జడ్జి జివిఎల్‌వి.ప్రసాద్ తెలిపారు. స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో కక్షిదారులతో శనివారం లోకదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ప్రసాద్ మాట్లాడుతూ అనుకోకుండా కొన్ని ఘటనలు జరుగుతాయని క్షణికావేశంలో జరిగిన సంఘటనలు గుర్తు చేసుకోకుండా మరిచిపోయి రాజీ చేసుకుంటే గ్రామాలలో కక్షలు తగ్గుతాయన్నారు. కుటుంబ తగాదాలు, ముఠా కక్షలు, భూ తగాదాలు వంటివి రాజీ చేసుకోవాలని కక్షిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి సరస్వతి, డిఎస్‌పి అశోక్‌వర్ధన్‌రెడ్డి, న్యాయవాదులు సురేష్, సంఘ సేవకుడు జీవిరత్నం, ఎస్‌ఐలు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-దర్శి

విద్యార్థులు కథలు, ఆటలు, పాటలు, డ్యాన్స్ పోటీలలో రాణించాలని స్థానిక గ్రంథపాలకురాలు ఎల్. సుమతి తెలిపారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు శనివారం వివిధ రకాల పోటీలు నిర్వహించారు. విజేతలకు త్వరలో బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథ పాలకురాలు తెలిపారు. **కొండపి :** పుస్తక పఠనంతో మంచి భవిష్యత్తు లభిస్తుందని కట్టావారిపాలెం ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు నీతి కథలు బోధించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులను వేసవిలో విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు బి.కోటేశ్వరరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి- కంభంరూరల్

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యనభ్యసించేందుకై పేద విద్యార్థులు ఈనెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంఇఒ బి.మాల్యాద్రి తెలిపారు. విద్యా హక్కు చట్టం పేద విద్యార్థులకు వరమన్నారు. బిపిఎల్ కుటుంబాలు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యనభ్యసించేందుకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 12(1)సి ప్రకారం అన్ని ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో 1వ తరగతిలో 25 శాతం సీట్లను బిపిఎల్ (దారిద్ర్య రేఖకు దిగువ) కుటుంబాలకు ఉచితంగా కేటాయింపు చేసినట్లు తెలిపారు. విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థులు 10వ తరగతి వరకు విద్యాభ్యాసాన్ని ఉచితంగా కొనసాగించవచ్చని తెలిపారు. వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు తమ సచివాలయ పరిధిలోని అర్హులైన కుటుంబాలకు వాలంటీర్ల ద్వారా సమా చారాన్ని తెలియజేసి విద్యాహక్కు చట్టంపై అవగాహన కల్పించి దరఖాస్తు చేయించాలన్నారు.

ప్రభుత్వమే ఇకెవైసి చేయించాలి

ప్రజాశక్తి-పొదిలి

ఇకెవైసికి చివరి తేదీతో సంబంధం లేకుండా ప్రభుత్వ అధికారులే చేయించాలని పెన్షనర్ల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో పొదిలి తాలూకా యూనిట్ సమావేశం అధ్యక్షుడు బాదుల్లా అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాదుల్లా మాట్లాడుతూ ప్రతి నెల 1వ తేదీనే పింఛను ఇవ్వాలని అన్నారు. ఇహెచ్‌ఎస్ సౌకర్యం అన్ని ఆసుపత్రుల్లో కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి షేక్ మదార్‌వలి, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఎ వీరారెడ్డి, కోశాధికారి సిహెచ్ సుబ్బారావు, గౌరవాధ్యక్షుడు డివిఎ నరసింహారావు పాల్గొన్నారు.

స్వీట్లు పంపిణీ

ప్రజాశక్తి-దర్శి

కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీలో విజయం సాధించడం పట్ల దర్శి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌ఛార్జ్ పుట్లూరి కొండారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. స్థానిక గడియారస్తంభం సెంటర్‌లో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో శనివారం స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ దేశంలో వచ్చే సార్వత్రిక ఎన్నికలలో అధికారంలో ఉన్న బిజెపికి ఓటమి తప్పదన్నారు. మోడీ ప్రభుత్వం ప్రభుత్వ ఆస్తులను అంబానీకి, ఆదానికి కట్టబెడుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోటయ్య, పుల్లారెడ్డి, జయసింహారెడ్డి, గురవయ్య తదితరులు పాల్గొన్నారు. **టంగుటూరు :** మతతత్వ బిజెపిని ఇంటికి సాగనంపేందుకు దేశ ప్రజలంతా సంసిద్ధులయ్యారనడానికి కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయమే నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్రీపతి ప్రకాశం తెలిపారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఘన విజయం సాధించిన సందర్భంగా నియోజకవర్గ నాయకులు బొడ్డు సతీష్, పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజును కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ ఎంపిటిసి బొడ్డు సతీష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-టంగుటూరు

టిడిపి ఎస్‌సిసెల్ మండల నాయకుడు కొమ్ము భానుచందర్ సోదరుడు కొమ్ము మనోజ్ కుమార్ ఇటీవల చెందాడు. మనోజ్ కుమార్ దశదిన కర్మ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పాల్గొని మనోజ్ కుమార్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్‌సిసెల్ నాయకులు కొమ్ము భానుచందర్, ఎస్‌సిసెల్ రాష్ట్ర కార్యదర్శి ధర్నాసి బ్రహ్మానందం, నాయకులు కొమ్ము చిట్టిబాబు, పొదిలి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా జిల్లా అధికారులతో కలిసి భద్రతపై ఎఎస్‌ఎల్(అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్)ను ఎస్‌పి వకుల్ జిందాల్ శనివారం పరిశీలించారు. వైఎస్‌ఆర్ మత్స్యకార భరోసా నగదు పంపిణీని ప్రారంభించేందుకు ఈనెల 17న బాపట్ల జిల్లా నిజాంపట్నంకు రాష్ట్ర ముఖ్యమంత్రి వస్తున్నారు. భద్రత ఏర్పాట్లను ముందస్తుగా జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, ఇంటలిజెన్స్ మరియు ఇతర అన్ని విభాగాల అధికారులతో కలిసి ఎస్‌పి పరిశీలించారు. హెలికాప్టర్ దిగేందుకు ప్రత్యేకంగా నిర్మిస్తున్న హెలిప్యాడ్ ప్రాంతాన్ని, అక్కడ చేపట్టిన భద్రత ఏర్పాట్లు పరిశీలించారు. సిఎం కాన్వాయ్‌కి సంబంధించిన రూట్ మ్యాప్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. హెలిప్యాడ్ నిర్మాణం చుట్టూ బారికేడ్లు ఏర్పాట్లు, సభా వేదిక ఏర్పాటు, సభా ప్రాంగణం లోపలకి ప్రజలు వచ్చేపోయే మార్గాలు, విఐపి మార్గాలు, సభకు వచ్చు ప్రజల వాహనాల పార్కింగ్, విఐపి వాహనాల పార్కింగ్ స్థలం వద్ద బందోబస్తు మరియు భద్రత ఏర్పాటులను సమీక్షించి అధికారులకు

ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

పలు సూచనలు చేశారు. సిఎం కాన్వాయ్ వచ్చే మార్గం, సభ ప్రాంగణంలో ప్రతి ప్రాంతం పూర్తి స్థాయిలో కవర్ అయ్యేవిధంగా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్‌పి అధికారులను ఆదేశించారు. పూర్తిస్థాయి బారికేడింగ్ ఉండేలా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. రూఫ్ టాప్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి భద్రత పెంచాలన్నారు. వాహనాల పార్కింగ్‌కు, ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని పోలీసు అధికారులను ఎస్‌పి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి మహేష్ , రేపల్లె డిఎస్‌పి మురళీకృష్ణ, ఎఆర్ డిఎస్‌పి ప్రేమ్ కుమార్, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ ఎ. శ్రీనివాస్, ఇతర పోలీస్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వాహన చోదకులకు అవగాహన

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో నో యాక్సిడెంట్ డే డ్రైవ్ శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతా ప్రమాణాలు, ట్రాఫిక్ నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యమైన కూడళ్ళ, బ్లాక్ స్పాట్స్, యాక్సిడెంట్ ప్రోన్ ఏరియాల వద్ద విధులు నిర్వహించారు. హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం, రహదారి భద్రత మన జీవితాలకు రక్షణ అంటూ ద్విచక్రవాహనాలపై ప్రయాణించే వారు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే జరిగే అనర్థాల గురించి అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలు రోడ్డు భద్రతా నియమాలు సరిగా పాటించకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి అనేక మంది తమ విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని,ఆ ప్రభావం వారి కుటుంబంపై పడుతుందని, వారి జీవితం ఒక్కసారిగా ఛిన్నాభిన్నం అవుతుందని వివరించారు.

వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారి

వాహనదారులు రోడ్డు భద్రత మరియు ట్రాఫిక్ నియమాలు తప్పక పాటించాలన్నారు. అతి వేగం, మద్యం మత్తులో వాహనాలు నడపరాదన్నారు. వాహనాలు నడిపేటప్పుడు మీ భద్రత మరియు మీ కుటుంబ క్షేమం దృష్టిలో ఉంచుకొని హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు.

ఎపి ఇఎపిసెట్-2023 నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-మార్కాపురం

స్థానిక డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో ఎపి ఇఎపిసెట్-2023 ఎంట్రన్స్ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల కార్యదర్శి ఆదిమూలపు విశాల్ శనివారం తెలిపారు. ఈ ఎంట్రన్స్ పరీక్ష ఈ నెల 15 నుంచి 23 వరకు ప్రతి రోజూ రెండు సెషన్స్‌లో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పరీక్షకు కళాశాల సెంటర్‌లో 1328 మంది ఎంపిసి విద్యార్థులు, 680 మంది బైపిసి విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎపి ఇఎపిసెట్-2023 ఎంట్రన్స్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎపి ఇఎపిసెట్-2023 ఎంట్రన్స్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం ఉచిత బస్సు సౌకర్యం కల్పించినట్లు ఆయన చెప్పారు. ఈ సౌకర్యాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు వివిధ సెంటర్ల నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. వివరాలకు బస్ ఇన్‌ఛార్జులు పి.ఖాదర్‌ఖాన్ (దోర్నాల) సెల్: 8247398357, కె.సురేష్‌కుమార్ (యర్రగొండపాలెం) సెల్: 9966010015, బి.హయ్యర్ జయదేవ్ (త్రిపురాంతకం) సెల్: 9000094136, పుష్పకుమార్ (గిద్దలూరు, బి.పేట, తర్లుపాడు) సెల్: 7386 626904, కె.వెంకటేశ్వరరావు సెల్: 8499982123, ఎం.ఆంజనేయులు (మార్కాపురం) సెల్: 93468 42997 నంబర్లను సంప్రదించాలన్నారు.

విద్యాకానుక కిట్లు పరిశీలన

వెలిగండ్ల : విద్యా కానుక కిట్లు భద్రపరిచిన గోదాములను నిరంతరం పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ పాఠ్య పుస్తకాల సంచాలకులు కె.రవీంద్రారెడ్డి తెలిపారు. వెలిగండ్ల, కనిగిరి, జెవిక మండల స్టోరేజ్ పాయింట్లను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలను తరగతి వారిగా, టైటిల్ వారిగా సర్దుకోవాలన్నారు. పంపిణీ సమయంలో సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. బూట్లు, బ్యాగులు, బెల్టులు, నోట్‌పుస్తకాలు లాంటి సామగ్రినివేరువేరు గదుల్లో సైజుల వారిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. డైరెక్టర్ రవీంద్రారెడ్డి వెంట కనిగిరి, వెలిగండ్ల ఎంఇఒలు జె.ప్రసాదరావు, దాస్‌ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు కొండారెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-వెలిగండ్ల

10వ తరగతి పరీక్షలలో 586 మార్కుల సాధించి మండల పరిధిలోని మొగుళ్ళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నేరెళ్ల హరికిష్ణ, ఆవుల ప్రహ్లాదరెడ్డిని శనివారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ దాస్ ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరాజుల కొండారెడ్డి, ఉపాధ్యాయులు పార్వతి, పార్వతమ్మ, షేక్.ఖాదర్, మొహిద్దీన్ పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో 'శారద' విద్యార్థుల ప్రతిభ

పది, ఇంటర్ ఫలితాలలో సత్తా చాటిన విద్యార్థులు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ శనివారం విడుదల చేసిన పది, ఇంటర్ ఫలితాల్లో మార్టూరుకు చెందిన శ్రీ శారదా నికేతన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. పదో తరగతి ఫలితాల్లో కె విజయ్ బాబు (ఒంగోలు) 86 శాతం సాధించి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాడు. జి గోపి (పరిటాలవారిపాలెం) 72 శాతంతో ద్వితీయ స్థానంలోనూ, 66 శాతం సాధించిన ఆర్ హేమంత్ (రావిపాడు) తృతీయ స్థానంలో నిలిచారు. ఇంటర్ మీడియట్ రెండో సంవత్సరం సీఈపీ విభాగంలో యర్రగొండపాలెం సమీపంలోని అమాను గుడిపాడుకు చెందిన లక్ష్మీ నారాయణ 69 శాతంతో ప్రథమ స్థానంలోనూ, ఒంగోలు సమీపంలోని పెళ్లూరు గ్రామానికి చెందిన ఎం జయంత్ ఎంపీసీ విభాగంలో 65 శాతం సాధించి ద్వితీయ స్థానంలోనూ, బల్లికురవ మండలం వల్లపల్లి గ్రామానికి చెందిన బొంత మరియమ్మ బైపీసీ విభాగంలో 63 శాతం సాధించి తృతీయ స్థానంలో నిలిచారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల అమెరికాలో ఉంటున్న శ్రీ శారదా నికేతన్ వ్యవస్థాపకులు డాక్టర్ పోలినేని సుబ్బారావు స్కైప్ వీడియో కాల్ ద్వారా విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి 100 శాతం ఉత్తీర్ణత కోసం కృషి చేసిన ప్రధానోపాధ్యాయులు తమ్ములూరి విక్టర్ వీరయ్య, ఉపాధ్యాయులు ఈదర సునీల్, జి నాగభూషణం ఇతర సబ్జెక్ట్ టీచర్లను ప్రత్యేకంగా అభినందించారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు

అధిక మార్కులు సాధించిన విద్యార్థి హానీష్, విద్యార్థులను అభినందిస్తున్న ఛైర్మన్ ప్రకాశరావు

సిబిఎస్ఇ ఫలితాల్లో ఎంజెఆర్ స్కూల్ హవా!

ప్రజాశక్తి-వేటపాలెం

సజ్జా హనీష్

సిబిఎస్ఇ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో చీరాల్లోని ఎంజెఆర్ విద్యా ఇంగ్లీష్ మీడియం స్కూల్ సత్తా చాటింది. చీరాల నియోజక వర్గంలోనే ఉత్తమ మార్కులు సాధించారు. శనివారం వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం పంచాయతీ 216 జాతీయ రహదారి వెంట ఉన్న హైస్కూల్లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల ఛైర్మన్ ప్రకాశరావు మాట్లాడుతూ 461 మార్కులు సాధించిన సజ్జా హనీష్‌ను ప్రశంసించారు. పరీక్షలకు హాజరైన విద్యార్థులు అందరూ ఉత్తీర్ణత సాధించి నూరు శాతం ఫలితాలను సాధించడం తనకు సంతోషంగా ఉందని అన్నారు. భవిష్యత్‌లో శ్రద్ధగా చదువుకొని ఉన్నతంగా సమాజంలో ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ రాధాకుమారి, నరసింహారావు, ఆలీసాహెబ్, ఉపా ధ్యాయులు ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆల్ఫాన్ ఇంటర్నేషనల్ స్కూల్లో నూరు శాతం ఉత్తీర్ణత

సిబిఎస్ఇ పదో తరగతి పరీక్షా ఫలితాలలో ఆల్ఫాన్ ఇంటర్నేషనల్ స్కూల్ చీరాల విద్యా సంస్థ నూరు శాతం ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ హెచ్ఎస్ మంజునాథ్ తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్లో శనివారం అభినందన సభ నిర్వహించారు. ఈ ఫలితాలు తమ పాఠశాలలోని ఉపాధ్యాయుల ఉత్తమ బోధనకు తార్కాణమని అన్నారు. అమరా భరత్ 500 మార్కులకు గాను 406 మార్కులు సాధించి స్కూల్ ఫస్ట్ వచ్చాడన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పనబాక లక్ష్మి

అధినేత ఆదేశిస్తే..

బాపట్ల ఎంపీగా పోటీ చేస్తా: పనబాక

ప్రజాశక్తి-బాపట్ల

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశిస్తే బాపట్ల లోక్ సభ నుంచి తెలుగుదేశం పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయడానికి సిద్ధమేనని మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి అన్నారు. శనివారం బాపట్ల తెదెపా కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వేగేసేన నరేంద్ర వర్మతో కలిసి విలేకరుల సమావేశంలో పనబాక మాట్లాడారు. తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ పై వైకాపా నేతలు విమర్శలు చేయడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికి అభిప్రాయం చెప్పే హక్కు ఉంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో బాపట్ల సీటు కేటాయించాలని అధినేత చంద్రబాబుని అడుగుతానన్నారు. పార్టీ ఆదేశానుసారం ఎక్కడ పోటీ చేయమంటే అక్కడ పోటీ చేస్తానన్నారు.బాపట్ల సూర్యలంక తీరంలో నిర్మించిన తారకేశ్వర స్వామి దేవస్థానం ప్రారంభోత్సవ కార్యక్రమంతోపాటు ఆదివారం వేగేశన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నరేంద్ర వర్మ నిర్వహిస్తున్న మహా రుద్రాభిషేకం కార్యక్రమంలో పాల్గొంటానన్నారు.

టిడిపి సభలకు జనాన్ని చూసి వైసిపికి వణుకు

తెలుగుదేశం పార్టీ సభలకు వస్తున్న జనాన్ని చూసి వైసీపీకి వెన్నులో వణుకు పుట్టి రాజ్యాంగ విరుద్ధంగా జీవో నెంబరు 1 తెచ్చి ప్రతిపక్షాల గొంతు నొక్కలని జగన్మోహన్‌రెడ్డి చూస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో దళితులకు తీరని ద్రోహం చేస్తున్నారు. వారికి న్యాయంగా రావాల్సిన హక్కులు కూడా వారికి అందడం లేదని, సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గొలపల శ్రీనివాసరావు, ఇనగంటి గాంధీ, తోట నారాయణ, మోదుగుల శంకర రెడ్డి, ఫరీద్ మస్తాన్, జిట్టా ప్రమీల రాణి, పల్లం సరోజిని, రామ సుబ్బారావు,ముసలయ్య, ఆంద్రేయ్య,ఉమ్మారెడ్డి వెంకటేష్,దొమ్మలపాటి శ్రీనివాసరావు, వెంకట్రావు, హైమావతి పాల్గొన్నారు.

పడకేసిన ప్రజారోగ్యం

మొద్దునిద్రలో ప్రభుత్వం: గొట్టిపాటి

ప్రజాశక్తి-అద్దంకి

గ్రామాల్లో ప్రజారోగ్యం పడకేసిందని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. పట్టించుకోవాల్సిన ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోందని విమర్శించారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా సంతమాగులూరు మండలం పత్రేపురం, సజ్జాపురం, గ్రామాలలో పలు వివాహ వేడుకలకు ఎమ్మెల్యే గొట్టిపాటి హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామాలలో విషజ్వరాలు ప్రబలుతున్నాయని, పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ వందలాది వ్యాధులను ఆరోగ్యశ్రీలో చేర్చామంటూ ప్రచార ఆర్భాటాలకు పోతున్న ప్రభుత్వం ప్రబలిపోతున్న మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ జ్వరాలను నియంత్రించడంలో పూర్తి వైఫల్యం చెందిందని అన్నారు. గ్రామాలలో పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో సీజనల్ వ్యాధుల బారిన పడి నియోజకవర్గంలో ప్రజారోగ్యం పడకేసిందని అన్నారు. విషజ్వరాలు, డెంగీ, మలేరియా జ్వరాల బారినపడి ప్రజలు విలవిలలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

బాధితులను పరామర్శిస్తున్న శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్

కిమ్స్ వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-పంగులూరు

పంగులూరు మండల పరిధిలోని చందలూరు గ్రామ రైతు భరోసా కేంద్రం దగ్గర శనివారం సుధాకర్ అండ్ అశోక్ ఫ్రెండ్ సర్కిల్ వారి ఆధ్వర్యంలో కిమ్స్ హాస్పిటల్స్ ఒంగోలు వారి సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరానికి చందలూరు చుట్టుపక్కల గ్రామాల ప్రజల నుంచి మంచి స్పందన లభించినట్లు వైద్య శిబిర సమన్వయకర్త తాళ్లూరి రామాంజనేయులు, కిమ్స్ హాస్పిటల్స్ అద్దంకి ఏరియా మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పి కాలేషావలి తెలియజేశారు. ఈ వైద్య శిబిరంలో కిమ్స్ వైద్యులు డాక్టర్ బైపనేని రామాంజనేయులు (సాధారణ వైద్య నిపుణులు) సుమారు 150 మంది రోగులకు ఉచితంగా షుగరు, బిపి, ఈసీజీ పరీక్షలు నిర్వహించి వారికి ఒక వారం రోజులకు సరిపడా మందులు కూడా ఉచితంగా పంపిణీ చేశారు. వీరిలో మెరుగైన వైద్య చికిత్సల కోసం సుమారు 20 మందిని ఒంగోలులోని కిమ్స్ హాస్పిటల్‌కు సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ మంత్రి విస్తృత పర్యటన

ప్రజాశక్తి-నగరం

వేమూరు నియోజకవర్గంలోని అమృతలూరు, చుండూరు మండలాలలో శనివారం మాజీమంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు విస్తృత పర్యటన చేపట్టారు. పలు కార్యక్రమాలలో పాల్గొని కార్యకర్తలతో మమేకమై పార్టీ కార్యక్రమాలను చర్చించారు. అమృతలూరు మండలం యాలవర్రు గ్రామంలో టిడిపి నాయకులు నారిశెట్టి శోభనబాబు కుమారుని వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. అలాగే చుండూరు మండలం యడ్లపల్లిలో టిడిపి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 15వ తేదీ నాటికి లోకేష్ పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసుకుంటుందని 175 నియోజకవర్గాలలో సంఘీభావ యాత్ర నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శుభకార్యానికి ఎమ్మెల్యే హాజరు

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి పట్టణంలోని నాగులపాడు రోడ్డులో కామేపల్లి కళ్యాణ మండపంలో శుక్రవారం జరిగిన రావూరి రంగయ్య విజయలక్ష్మి దంపతుల మనవళ్ల నూతన వస్త్ర బహూకరణ శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ వేడుకలకు హాజరై నిషిత్ చౌదరి, కుశాంత్ చౌదరిలను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని టిడిపి కార్యకర్తలు, నాయకులు తదితరులు హాజరయ్యారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-నిజాంపట్నం

ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు కోరారు. ఈ నెల 16వ తేదీన నిజాంపట్నంలో మత్స్యకార భరోసా నగదు పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హాజరవుతున్న నేపథ్యంలో శనివారం ఎంపీ మోపిదేవి సభా స్థలి ప్రాంగణంలో జరుగుతున్న పనులను, హెలిప్యాడ్ స్థలాన్ని పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు తెలిపారు.

దెబ్బతిన్న మొక్కజొన్న పరిశీలన

ప్రజాశక్తి-నగరం

భట్టిప్రోలు మండలం పల్లెకోన, రాచూరు గ్రామాలలో వర్షాలకు దెబ్బతిని మొలకలు వచ్చిన మొక్కజొన్న పంటను శనివారం ఎంపిపి డివి లలితకుమారి, బాపట్ల జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌కె అబ్దుల్ సత్తార్‌లు పరిశీలించారు. దెబ్బతిన్న ప్రతి పంటను నమోదు చేసి రైతులకు న్యాయం జరిగే విధంగా చూడాలని జెడి సూచించారు. అలాగే రంగుమారిన జొన్న, మొక్కజొన్న పంటను కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు విక్రయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి టి ఉదయ్ భాస్కర్, ఎఓ మీరయ్య, గ్రామ సర్పంచ్‌లు రాధాకృష్ణ, రాజమ్మ, నాయకులు రామకోటేశ్వరరావు, బాలాజీ, మల్లేశ్వరరావు తదితరులు ఉన్నారు.

మేదరమెట్లలో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-మేదరమెట్ల

మేదరమెట్ల నడిబొడ్డులో ఆక్రమణల తొలగింపు కార్యరూపం దాల్చింది. రెండు దశాబ్దాలకు ముందు ఆక్రమణల తొలగింపు జరిగింది. మరల ఇప్పుడు ప్రజాప్రయోజనాల దృష్ట్యా ఆక్రమణల తొలగింపు ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్, వీఆర్వోలు, పంచాయతీ సిబ్బంది, పోలీసు వారి సహకారంతో గుంటూరు రోడ్డు నుండి ఆక్రమణ తొలగింపు శనివారం ప్రారంభించారు.

శరవేగంగా ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు

ప్రజాశక్తి-నిజాంపట్నం

నిజాంపట్నంలో జరిగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటనకు ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. ఈ నెల 16వ తేదీన నిజాంపట్నంలో నాలుగో విడత మత్స్యకార భరోసా కార్యక్రమానికి ముఖ్యమంత్రి జగన్ హాజరవుతున్న నేపథ్యంలో బాపట్ల జిల్లా యంత్రాంగం ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాటులో నిమగ్నమయ్యారు.

వైసిపికి ఆదరణ పెరుగుతోంది

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-త్రిపురాంతకం

పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజల ముఖాల్లో ఆనందం చూడడమే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి రోజురోజుకూ ప్రజల్లో ఆదరణ పెరుగు తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. మండల పరిధిలోని మండలం లోని కేశినేనిపల్లి గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలను తెలుసుకొని కొన్నింటికి సంబంధిత అధికారుల ద్వారా అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని స్థాపించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి గ్రామ సచివాలయ, వాలంటరీ వ్యవస్థలను నెల కొల్పారన్నారు. అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ పారదర్శకంగా పథకాలను వారింటికే అంద జేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన నాలుగేళ్లలో సిఎం జగన్మోహన్‌రెడ్డి అనేక సంస్కరణలను తీసుకువచ్చారని చెప్పారు.

ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి సురేష్

విద్య, వైద్యానికి ప్రాధాన్యం..

విద్య, వైద్య రంగాలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్న మంత్రి తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో ఎన్నడూ లేని విధంగా పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి స్టేట్ ఫస్ట్ వచ్చిందంటే ప్రభుత్వ విద్యలో జగనన్న ఎన్ని సంస్కరణలు తీసుకువచ్చారో తెలుసుకోవాలని హితవు పలికారు. నాడు-నేడు పనులు ద్వారా పాఠశాలల రూపురేఖలను మార్చిన ఘనత జగనన్నదేనన్నారు. మహిళల సాధికారత కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. తమ ప్రభుత్వంపై రోజురోజుకూ ప్రజల్లో ఆదరణ పెరుగుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ జగన్ మోహనరెడ్డినే ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన భాధ్యత మనందరిపై ఉందన్నారు. తొలుత స్థానికులు మంత్రి సురేష్‌కు ఘనం స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కోట్ల సుబ్బారెడ్డి, నాయకులు పిచ్చయ్య, పోలిరెడ్డి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు

పురస్కారం అందుకుంటున్న పొన్నూరు వేంకట శ్రీనివాసులు

పొన్నూరు వేంకట శ్రీనివాసులుకు

శకపురుషుడు పురస్కారం ప్రదానం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

శక పురుషుని శతాబ్ది ఉత్సవ కమిటీ తెనాలి వారి ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారకరామారావు శతజయంతి ఉత్సవాలలో ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులును ఎన్‌టిఆర్ శతాబ్ది పురస్కారంతో సత్క రించారు. తెనాలిలోని దేవభక్తుని బాపేశ్వరరావు మెమోరియల్ పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందచేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సినిమాలలో ఎన్‌టిఆర్ నటించిన పాత్రలపై పొన్నూరు శ్రీనివాస్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో శక పురుషుని శతాబ్ది ఉత్సవ కమిటీ సభ్యులు అయినాల మల్లీశ్వరరావు, ఆళ్ల వెంకటేశ్వర్లు, ఎల్.భీమేశ్వర ప్రసాద్, ఎన్టీఆర్ జగన్, బేరిశెట్టి భాస్కర్, ముప్పనేని మాధవరావు, బెల్లంకొండ వెంకట్, ముళ్ళపూడి వేంకట పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సిపిఎం

అలుపెరగని పోరాటం

ప్రజాశక్తి-కనిగిరి

ప్రజా సమస్యలపై సిపిఎం అలు పెరగని పోరాటం చేస్తుందని సిపిఎం కనిగిరి పట్టణ కార్యదర్శి పిసి కె.శవరావు తెలిపారు. కనిగిరి మున్సి పాలిటీలో ఇంటింటికీ సిపిఎం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందించాలన్నారు. ఇంటి పన్నులు తగ్గి ౨ తొలగించాలని, శివారు కాలనీల్లో మౌళిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రనజలకు రేషన్ సరుకులు సక్రమం గా పంపిణీ చేయాలని, రూ 10 లక్షలతో కాలనీలు కట్టించి ఇవ్వాలన్నారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ భూముల్లో అక్రమంగా వెంచర్లు వేయకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజా సమస్యలపై సిపిఎం గత రెండు సంవత్స రాలుగా అనేక ఉద్య మాలు చేపట్టినట్లు తెలిపారు. ఆర్భాటాలు మాని ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు, పాలకులు చర్యలు చేప ట్టాలన్నారు. రాబోవు కాలంలో ప్రజల సమస్యలపై అనేక ఉద్యమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇంటింటికీ సిపిఎం కార్యక్రమం ద్వారా సిపిఎం శ్రేణులు ప్రతి ఇంటికి రావటం జరుగుతుందని ప్రజలు ఆర్థిక సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో బషీరా, నరేంద్ర, ఆర్. ఏడుకొండలు, కేశవ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కెజి.మస్తాన్

ప్రజాశక్తి-మర్రిపూడి

జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కెజి.మస్తాన్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని జువ్విగుంట, గంగపాలెం గ్రామాలలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో గ్రూపులు వారీగా పని కొలతలు ఉండేవని, ఎంత పని చేస్తే అంత వేతనం వచ్చేదని ఇప్పుడు అందరికీ కలిపి కొలతలు తీసుకోవడంతో పని చేసినవారికి, చేయనివారికి వేతనంలో తేడా కనిపించడం లేదని కూలీలు తెలిపారు.దీంతో స్పందించిన మస్తాన్ మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం చేసిన మార్పులు కారణంగా ఇలా జరుగుతుందన్నారు. మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు ఇలాంటి చర్యలు తీసుకుంటుందని విమర్శించారు. మస్టరు, పని కొలతలు ఆధారంగా వేతనాలు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం రోజువారీ వేతనం రూ. 272 కాగా రూ. 200లకు మించి రావడం లేదని వాటిలో కూలీలు ఎలా బతకాలని ఆయన ప్రశ్నించారు. అనేక పోరాటాల ఫలితంగా సాధిం చుకున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడం తగదన్నారు. కూలీందరూ దీన్ని వ్యతిరేకించాలన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న కెజి. మస్తాన్

వైసిపిలో అనిశ్చితి

సీనియర్ నేత బాలినేని దుదంతం తర్వాత వైసిపిలో అనిశ్చితి కొనసాగుతోంది. పార్టీలో ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ చర్చ నేతల మధ్య సాగుతోంది. బాలినేని మీడియాతో మాట్లాడాక పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు.హైదరాబాదులోనే ఉన్నారు. అధిష్టానంలోని కొందరు పెద్దలు తనకు వ్యతిరేకంగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఆయన పరిస్థితి వైసిపి భవిష్యత్ రాజకీయాలను అయోమయంలో పడేశాయి. ఆయన్ను నమ్ముకుని ఉన్న ముఖ్యనేతల్లోనూ కలవరం మొదలైంది. పలు రకాలుగా ఊహాగానాలు కూడా తెరపైకి వచ్చాయి. బాలినేని పార్టీలోనే కొనసాగుతారా?లేదా?అనే చర్చలు వరకూ వచ్చాయి. ఇవన్నీ వైసిపిలోనే ఉత్కంఠగా వినిపిస్తున్నాయి. తనను కలిసిన నేతలకూ బాలినేని తనకు ప్రాధాన్యత లేదని, పార్టీ అనుమానపు ధోరణితోనే ప్రవర్తిస్తోందన్న భావనను వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో ఆయనకు వ్యతిరేకంగా ఉన్న నేతలు కూడా ఆచితూచి అడుగులు వేస్తున్నారు. బాలినేని ద్వారా టిక్కెట్లు పొంది ఇపుడు ఆయనపైనే ఫిర్యాదులు చేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో స్పష్టంగా తెలుస్తోంది.ఇక్కడ జరుగుతోన్న పరిణామాలపై ప్రతిపక్ష పార్టీలు కూడా దృష్టిసారించాయి. బాలినేనిపై ప్రచారం మాత్రం స్పష్టంగా జరుగుతోంది. రానున్న కాలంలో అధిష్టానం పెద్దలు నిర్ణయం ఏమిటనేదీ తేలాల్సి ఉంది. మీడియా సమావేశంలో బాలినేని ఆవేదనతో చెప్పిన మాటలు పాలకపక్షంలో దుమారం రేపాయి. పార్టీ పెద్దలు మాత్రం ఆయన చేసిన వ్యాఖ్యలపై ఎవరూ స్పందించలేదు. తన బంధువే ఇదంతా చేస్తున్నారనే కోణంలో బాలినేని ఆరోపణలు చేశారు. దీనికి ఆయన బంధవు నుంచి కూడా ఎలాంటి స్పందన రాలేదు. పార్టీకి నష్టమా?లాభమా?అనే కోణంలోనూ ఎవరూ దృష్టి సారించలేదు. జిల్లాలోనూ ఎవరూ పెద్దగా స్పందించకపోవడం వెనుక పార్టీ పెద్దల హస్తం ఉందనే చర్చ సాగుతోంది.ఈ పరిణామాలు మాత్రం వైసిపిలో అనిశ్చితికి తెరలేపాయి. పార్టీ నేతల మధ్య అంతరాలను పెంచాయి. ఎవరిదారి వారిదన్నట్లుగా కనిపిస్తోంది. ఈ పరిణామాలు ఆందోళనగానే ఉన్నా పార్టీపెద్దల జోక్యం ఎండమావిగానే ఉంది. అంటే ఆయన వ్యాఖ్యలపై సీరియస్ కనిపించడం లేదు. ఇదంతా వెనుక వ్యూహాత్మకమేనా?అనే చర్చ కూడా సాగుతోంది. ఒంగోలులో ఆయన సన్నిహితులు సైతం గందరగోళంలో పడ్డారు. బాలినేని భవిష్యత్ పయనంపైనా పలు రకాలు చర్చలకు అధిష్టానంపెద్దలే కారణమనే భావన కూడా వ్యక్తమవుతోంది.

ప్రజాసమస్యలపై పోరాటాలు చేసే పార్టీలు,సంఘాలపై ప్రభుత్వం నిర్బంధం మోపుతోంది. నేతలను కదలకుండా నోటీసులు ఇస్తున్నారు. ముందస్తు అరెస్టులు,నిర్బంధాలు కొనసాగుతున్నాయి. మరోవైపు నిరంకుశ చట్టాన్ని కోర్టు రద్దు చేసింది.వాటిపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చ సాగుతోంది. ఇపుడు నిర్బంధాలు మాత్రం ఆగలేదు. ఒకవైపు ఉపాధ్యాయులపైనా కేసులు పెడుతున్నారు. వాటికి వ్యతిరేకంగా ఉపాధ్యాయ సంఘాలు ఏకమై పోరాటాలు చేస్తున్నాయి. తాజాగా పంట నష్టపోయిన రైతులకు పరిహారం కోరుతూ సిఎం కార్యాలయం ముట్టడికి రైతుసంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు పిలుపు నిచ్చాయి.ఇంకేముందీ పోలీసులు నోటీసులతో బయలు దేరారు. నేతల ఇళ్ల వద్దకు వెళ్లి కదలడానికి వీల్లేదంటూ హుకుం జారీ చేశారు. వర్షాలకు పంట దెబ్బతిన్న రైతులను ఆదుకోకపోగా దాన్ని ప్రశ్నించే వాళ్లను నిర్బంధాలకు గురిచేస్తున్నారు.ఈనెల12న సిఎం కార్యాలయం ముట్టడికి పిలుపునివ్వగా ముందురోజు రాత్రికి రాత్రే నేతల ఇళ్ల వద్దకు వెళ్లి నోటీసులు ఇచ్చారు. రైతుసంఘాలు, వ్యవసాయ కార్మికసంఘాల నేతలకు, కార్యకర్తలకు సుమారు 100 మందికిపైగా నోటీసులు ఇచ్చారు. తమకు తెలియకుండా ఆందోళనలకు వెళితే చర్యలు,కేసులు తప్పవంటూ హెచ్చరికలు చేస్తున్నారు. మరోవైపు 30 యాక్టు అమలులో ఉందంటూ నెలనెలా ప్రకటనలు ఇస్తున్నారు. ఎలాంటి ఉద్యమాలు చేయకూడదని ముందే ఇలాంటి చట్టాలను తెస్తున్నారు. అణచివేతలతో ప్రజాసమస్యలను పరిష్కారం చేయకుండా ఆపుతారా?దీని పర్యావసానాలు ఎలా ఉంటాయో తెలియదా? తెలిసినా లెక్కలేని తనమా?అన్నదీ ప్రశ్నార్థకంగా మారింది.

జనం సమస్యలతో రోడ్లెక్కుతుంటే వాటిని పరిష్కారం చేయకుండా జగనన్నకు చెబుదాం అంటూ అధికారులు కొత్త కార్యక్రమానికి తెరపైకి తెచ్చారు. ఏడాది పొడవునా అందుబాటులో ఉండే వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. మంత్రి, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఏ సమస్య వచ్చినా సిఎంకు చెబుదామనే చర్చను తెరపైకి తెచ్చారు. ఇదొక ప్రచార కార్యక్రమం గానే మారింది.వాస్తవానికి జిల్లాలో ఉన్న సమస్యల పరిష్కారానికి ఎవరూ నడుం బిగించడంలేదు. ప్రతి సోమవారం కలెక్టర్ నిర్వహించే స్పందనకు వందలాది మంది అర్జీదారులు వస్తున్నారు.క్షేత్రస్థాయిలో పాలనా వ్యవస్థలో అనేక మార్పులు తెచ్చినా సమస్యలు మాత్రం అక్కడ పరిష్కారం కావడం లేదు. నేరుగా కలెక్టర్ వద్దకే వస్తున్నారు. సచివాలయ వ్యవస్థ ఉన్నా పూర్తిస్థాయిలో అక్కడ జనం సమస్యలకు పరిష్కారం దొరకడంలేదు.భూ వివాదాలు తగ్గడం లేదు. రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కారం కావడంలేదు. చివరికి రేషన్‌కార్డుల నుంచి చనిపోయినవారి పేర్లు కూడా తీసేయాలంటే పెద్ద పనిగా మారింది. క్షేత్రస్థాయిలో సమస్యలపై పరిష్కారాలు దొరకనంత కాలం ఇలాంటి ప్రచార కార్యక్రమాలతో ఉపయోగం లేదు.